ప్రజాశక్తి
శ్రీకాకుళం
బుధవారం
జనవరి - 3
2018
12 పేజీలు



పాలకొండ : లుంబూరులో ఆర్‌డిఒ గున్నయ్యను నిలదీస్తున్న గ్రామస్తులు

జనాగ్రహం

- పింఛన్లపై నిలదీసిన లబ్ధిదారులు
- సమస్యలు పరిష్కరించని సభలు ఎందుకంటూ నిలదీత
- సీతంపేటలో సభలు బహిష్కరణ
- శ్రీకాకుళం, పాలకొండలో రచ్చకెక్కిన 'తమ్ముళ్ల' గ్రూపుల పోరు

(వార్త...4లో)


అప్రతిష్ఠ అంటగట్టేద్దాం

- 'జన్మభూమి' సభలో కలెక్టర్, జెసిలకు అనూహ్యంగా సన్మానం
- దగ్గరుండి ఇళ్లు నేలమట్టం చేయగలిగారంటూ మంత్రి అచ్చెన్నాయుడు కితాబు
- ప్రభుత్వ నిర్వాకం... అధికారులపై నెపం

(వార్త...4లో)



కలెక్టర్ ధనంజయరెడ్డిని సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



సిఎం టూర్ షెడ్యూల్ ఖరారు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఇచ్ఛాపురంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం జిల్లాకు రానున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన టూర్ షెడ్యూల్ ఖరారైంది. విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ నుంచి (మిగతా...4లో)



మాట్లాడుతున్న డిపిఒ కోటేశ్వరరావు

మరుగుదొడ్లు నిర్మించుకోండి

ప్రజాశక్తి-సారవకోట

మరుగుదొడ్లును ప్రతి కుటుంబమూ నిర్మించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డి కోటేశ్వరరావు సూచించారు. మంగళవారం వెంకటాపురం సర్పంచ్ గొల్లంకి జయమ్మ అధ్యక్షతన జరిగిన జన్మభూమి-మా ఊరు గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామాలను పారిశుధ్యంగా తీర్చిదిద్దాలన్నారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.



చంద్రన్న కానుకలు అందిస్తున్న సర్పంచ్ రజనీ

చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని సీతాపురం పంచాయతీలో చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ బెండి రజనీకుమారి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం రేషన్‌కార్డుదారులకు చంద్రన్న కానుకలను పంపిణీ చేశార్ను

ఈ కార్యక్రమంలో బెండి అప్పలసూర్యనారాయణ, బెండి నాగు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ లేని హెల్మెట్లు

ఆరంభ శూరత్వంగా మారిన వ్యవహారం

ప్రజాశక్తి-పలాస

ద్విచక్ర వాహన చోదకులను ప్రమాదాల బారి నుంచి రక్షించాలనే ఉద్దేశంతో హెల్మెట్లు ధరించాల నే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలపై గాయాలై మృతి చెందుతున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని హుకుం జారీ చేసింది.

హెల్మెట్లు లేకుండా ప్రయాణాలు చేసే వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించింది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 'హెల్మెట్స్ డ్రైవ్' నేడు ఎక్కడా కానరావడంలేదు. మూడు నెలలు మాత్రమే ఉధృతంగా హెల్మెట్లపై ప్రచారం నిర్వహించి వాహన చోదకుల్లో ప్రమాదాలపై అవగాహన తీసుకొచ్చారు. ఆ సమయంలో హెల్మెట్లు అమ్మకాలు పెద్దఎత్తున కొనసాగాయి. హెల్మెట్స్‌కు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్‌తో రూ.300 విలువ చేసే హెల్మెట్‌ను రూ.500 నుంచి రూ.700 వరకు అమ్మకాలు జరిపారు.

హెల్మెట్ల ధరలు పెరిగినప్పటికీ ప్రతిఒక్కరూ హెల్మెట్లు కొనుగోలు చేసి ధరించారు. దీంతో ఆ సమయంలో ప్రమాదాలు సంభవించినప్పుడు తలపై గాయాలై మరణించినవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రభుత్వం, పోలీసులు అప్పట్లో చూపిన శ్రద్ధ ప్రస్తుతం చూపకపోవడంతో హెల్మెట్లు ధరించే వారు కరువయ్యారు. పర్యావసానం తరుచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో నివారణా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

ప్రభుత్వం హెల్మెట్ల ప్రక్రియ ప్రారంభించిన మొదట్లోనే పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు ముమ్మరం చేశారు. వాహన రిజిస్ట్రేషన్ సమయంలోనూ హెల్మెట్లు కొనుగోలు చేసినట్లు రశీదు చూపించాలనే నిబంధన ప్రవేశపెట్టారు. పోలీసులు కఠిన వైఖరితో హెల్మెట్లు లేనివారు వాహనాలు నడపడానికి భయపడేవారు. అప్పట్లో అధికారులు చూపిన శ్రద్ధ ఆ తరువాత కాలంలో చూపకపోవడంతో పరిస్థితి మరలా మొదటికి వచ్చింది. ఏదో తూతూ మంత్రంగా వాహనాలు తనిఖీ చేపట్టి ప్రభుత్వానికి ఆదాయ మార్గం చూపేందుకు యత్నిస్తున్నారే తప్ప మంచి ఆశయం కోసం పనిచేయడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



హెల్మెట్ లేకుండా బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు

ఒకే బైక్‌పై ముగ్గురేసి వెళ్లడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేయడం వంటివి పెరుగుతూనే ఉన్నాయి. అధ్వాన్న రహదారులు, మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, అనుభవం లేని డ్రైవింగ్ తదితర కారణాలతో ప్రమాదాలను కోరి తెచ్చుకుంటున్నారు. రోడ్డు ఎక్కితే క్షేమంగా గమ్యస్థానానికి చేరుతామనే ధీమా లేకుండా పోయింది. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజలకు రెవెన్యూ సేవలు చేరువ చేయాలి

ప్రజాశక్తి-మందస

ప్రజలకు రెవెన్యూ సేవలు చేరువయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. మందసలో రూ.ఆరు లక్షలు వ్యయంతో నిర్మించిన తహశీల్దార్ కార్యాలయ అదనపు భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సేవలు విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అడంగల్, మ్యుటేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.వి.శ్యామసుందరరావు, ఆర్ఐలు అమరనాథ్, సునంద, సర్పంచ్ త్రివేణి తిరుపతి, ఎంపిపి దాసరి జయలక్ష్మి, టిడిపి మండలాధ్యక్షులు దాసరి తాతారావు, రట్టి లింగరాజు, బి.కర్రెయ్య, ఎల్.రుద్రయ్య, జె.అమ్మినాయుడు,



కార్యక్రమంలో మాట్లాడుతున్న శివాజీ

మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం తప్పనిసరి

సారవకోట: గ్రామాల పారిశుధ్యంగా ఉండడానికి శత శాతం మరుగుదొడ్లను నిర్మించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ జగదీశ్వరరావు అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఇతర అధికారులతో స్వచ్ఛ గ్రామాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రజలు ఆసక్తి చూపాలన్నారు. దీనికోసం పంచాయతీ స్థాయి అధికారులు, ఇతర సిబ్బంది చొరవ చూపాలని ఆయన సూచించారు.గ్రామాల పారిశుధ్యానికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ధర్మాన పద్మప్రియ, ఎంపిడిఒ జగదీశ్వరరావు, తహశీల్దార్ ఈశ్వరమ్మ, మండల ముఖ్య సలహాదారులు గెల్లంకి వెంకటరావు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం: జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఈ నెల నాలుగున ఇచ్ఛాపురం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విచ్చేస్తున్న సందర్భంగా ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అధికారులను సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెలీప్యాడ్ వద్ద నుంచి సభాస్థలం వరకు ఎటువంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వంద మందికిపైగా పనివార్లను ఏర్పాటు చేసుకోవాలనీ, మున్సిపాలిటీ, ఆర్అండ్‌బి అధికారులు, సిబ్బంది సహాయంతో జంగిల్ క్లియరెన్స్, రోడ్ల మరమ్మతుల పనులు చేపట్టాలన్నారు. అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలనీ, సిఎం పర్యటన విజయవంతానికి సహకరించాలన్నారు. ఆర్అండ్‌బి ఎఇ రవికాంత్ మాట్లాడుతూ రోడ్లకు మరమ్మతులు చేస్తున్నామనీ, డివైడర్లకు రంగులు వేస్తున్నామన్నారు. మైదాన స్థలం వద్ద జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నామనీ, హెలీప్యాడ్ వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు, మండల ప్రత్యేకాధికారి లవరాజు, తహశీల్దార్ సురేష్‌బాబు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కాలువలోకి దూసుకెళ్లిన అంబులెన్స్

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి లచ్చన్నపేట జాతీయ రహదారి సమీపంలో మంగళవారం ఓ ప్రైవేట్ అంబులెన్స్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. విశాఖ నుంచి ఖరగ్‌పూర్ వైపు ఆ అంబులెన్స్ వెళ్తోంది. అయితే అంబులెన్స్‌లో డ్రైవర్ మినహా ఎవరూ లేకపోవడంతో డ్రైవర్ గాయాలతో బయటపడగా తృటిలో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఇచ్ఛాపురం

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలం, మున్సిపాలిటీలోని మహిళా ఉపాధ్యాయులకు మంగళవారం మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అంతా ఉల్లాసంగా క్రీడల్లో పాల్గొన్నారు. విజేతలకు ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామని సూర్య నారాయణ, ధనుంజయ రావు, శ్రీనివాసరావు తెలిపారు.



ఆటలాడుతున్న ఉపాధ్యాయులు

సిఎం సభ ఏర్పాట్లు పరిశీలన



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-ఇచ్ఛాపురం

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఈ నెల నాలుగున సిఎం చంద్రబాబు పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం బహరంగ సభ ఏర్పాట్లను మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. హెలీప్యాడ్ పనులు, సురంగి రాజా క్రీడా మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని లోటుపాట్లను గుర్తించి సరిదిద్దాలని ఆర్అండ్‌బి, మున్సిపల్ డిఆర్‌డిఎ అధికారులకు మంత్రి ఆదేశించారు. అవసరమైతే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నుంచి పారిశుధ్య సిబ్బందిని తీసుకురావాలన్నారు. సభకు వచ్చే ప్రజలు, కార్యకర్తలకు ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వాహనచోదకులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలన్నారు. గట్టి బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీసు అధికారులను కోరారు. సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు ఉత్సాహం చూపించాలన్నారు. సభాస్థలం వద్ద ముఖ్యమంత్రి పరిశీలించేందుకు ఎటువంటి స్టాల్స్ ఏర్పాటు చేయాలో సూచించారు. విఐపి గ్యాలరీ, ప్రెస్‌క్లబ్ గ్యాలరీని ముందస్తుగా ఎంపిక చేసుకోవాలన్నారు.

సభను విజయవంతం చేయాలి

అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో మంత్రి అచ్చెన్నాయుడు సమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల వారీగా పార్టీ శ్రేణులను బలోపేతం చేయాలన్నారు. ప్రజలను సభాస్థలానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ ప్రాంతంలోని దీర్ఘకాలిక సమస్యలను గుర్తించి నివేదిక రూపంలో సిఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-రాజాం

మండల పరిధిలోని గురవాం గ్రామ సమీపంలో నీలగిరి తోటలో మంగళవారం ఉదయం చెట్టుకు వేలాడుతూ ఉన్న యువకుడు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడిది గురవాంకు చెందిన పాలవలస రాజు (20)గా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సిఐ వేణుగోపాలరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించిన అనంతరం మృతుడు తల్లి సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... గురవాం గ్రామానికి చెందిన పాలవలస రాజు ఇంటర్ మీడియట్ చదివిన అనంతరం చదువు మానేసి గ్రామ సమీపంలో ఉన్న జ్యూట్ మిల్లులో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో తల్లి సావిత్రి, చెల్లెలు రాజ్యలక్ష్మిని పోషించుకుంటూ ఉన్నాడు. అయితే రాజుకు మద్యం సేవించే అలవాటు ఉండడంతో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మూడు రోజుల నుంచి మద్యం సేవించి కనిపించినట్లు పలువురు చెబుతున్నారు. సోమవారం రాత్రి 10:30 గంటల సమయంలో ఫ్యాక్టరీ ముందు ఉన్న రోడ్డుపక్కన ఖానాపై రాజు ఒంటరిగా కూర్చొన్నట్టు కొంతమంది గుర్తించారు. తదనంతరం మంగళవారం ఉదయం దగ్గరలో ఉన్న చెట్టుకు వేళాడుతూ విగతజీవుడై పడి ఉన్నాడు. దీంతో రాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక ఎవరైనా చంపేసి అలా చెట్టుకు వెలాడదీసారా అన్న కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. అయితే మృతుడు తల్లి సావిత్రి మాత్రం రాజుతోపాటు తిరిగిన స్నేహితులే చంపేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రాజు మృతి అనుమానస్పదంగా ఉందని కేసు నమోదు చేస్తూ దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. మృతదేహానికి సంఘటనా స్థలంలోనే శవపంచనామా చేసి పోస్టుమార్టం కోసం రాజాం సామాజిక ఆసత్రికి తరలించారు.



మృతి చెందిన రాజు

మరో 3 నెలల్లో పెళ్లి

రాజుతోపాటు చెల్లెలు రాజ్యలక్ష్మికి మరో 3 నెలల్లో పెళ్లి జరగనున్నదని, వీరిద్దరికీ బూరాడ గ్రామానికి చెందిన వారితో కుండమార్పులు సంబంధం కుదిరిందని, ఇంతలోనే రాజు మృతి చెందడం దారుణమని గ్రామస్తులు తెలిపారు. స్వతహాగా రాజు మంచి కుర్రోడని, కుటుంబాన్ని పోషించుకుంటూ బాధ్యతాయుతంగా మెలుగుతూ ఉంటాడని, ఇంతలోనే ఇంత ఘోరం చోటుచేసుకోవడం ఆశ్చర్యకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



గౌరవ వందనంతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

అశ్రునయనాలతో ట్రైనీ కానిస్టేబుల్ అంత్యక్రియలు

రణస్థంరూరల్: మండలంలోని వల్లభరావుపేట గ్రామానికి చెందిన వి.సుబ్బారావు శ్రీకాకుళంలో శిక్షణ కేంద్రంలో ట్రైనింగ్ తీసుకుంటున్న కానిస్టేబుల్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా మంగళవారం పోలీస్ లాంఛనాలతో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. చిన్న వయస్సులోనే ఉద్యోగం సంపాదించిన సుబ్బారావు, అకాల మరణంతో కుటుంబంలోను, గ్రామంలో విషద ఛాయలు అలుముకున్నాయి. జిల్లా అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పనసారెడ్డి ఆధ్వర్యాన ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ పోలీసులు గౌరవ వందనంతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం సిఐ రామకృష్ణ, ఎస్ఐ వి.సత్యనారాయణ పాల్గొన్నారు. వైసిపి ఎచ్చెర్ల నియోజకర్గ సమన్వయకర్త కిరణ్‌కుమార్ మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అయ్యవారిపేటలో రెండిళ్లు దగ్ధం

బూర్జ: మండలంలోని అయ్యవారిపేటలో ఉదయం పది గంటలకు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆ గ్రామంలో చోడవరపు అప్పలనాయుడు, గొర్లె కళావతికి చెందిన రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. వీరు సర్వం కోల్పోయి వీధిన పడ్డారు. ఆమదాలవలస అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ అగ్నిప్రమాదం ఎలా చోటుచేసుకుందో గుర్తించలేకపోతున్నారు. ఇప్పటివరకు ఏ అధికారి కూడా వచ్చి వీరికి ఎటువంటి సహాయం అందించలేదు.

5 నుంచి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఉన్న బోలినేని మెడిస్కిల్స్‌లో ఈ నెల 5వ తేదీ నుంచి నర్సింగ్, పారామెడికల్ కోర్సుకు శిక్షణ ప్రారంభమవుతుందని బోలినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తృతీయ వార్షికోత్సవం సందర్భంగా 1000 మంది పేద విద్యార్థులకు బ్యాంకు రుణాలు ఇప్పించి నర్సింగ్, పారామెడికల్ కోర్సులనందు స్టైఫండ్‌తో చదివిస్తున్నామని తెలిపారు. ఎపిఎస్ఎస్‌బిసి ఆధ్వర్యంలో ఇప్పటివరకు 845 మందికి బోలినేని మెడిస్కిల్స్‌లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ కోర్సుల్లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన వారికి వారి నైపుణ్యాలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగలవారు 7680945357, 7337330138 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

'రిమ్స్'లో ఇహెచ్‌ఎస్ సేవలు

25 అంశాల్లో ఆరోగ్యసంరక్షణ పథకం

శ్రీకాకుళం రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) జనరల్ ఆస్పత్రిలో ఇహెచ్ఎస్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛన్‌దారులకు 25 రకాల తీవ్ర వాధ్యులకు సేవలు ఉచితంగా అందిస్తున్నారు. రిమ్స్‌లోని మొదటి అంతస్తులో రూమ్ నంబర్ 13లో రోజూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఓపి చూస్తారు.

1. హైపర్ టెన్షన్
2. హైపర్ థైరాయిడిజం
3. హైపో థైరాయిడిజం
4. రూమటోయిడ్ ఆర్థరైటిస్ – నడుం, కీళ్ల నొప్పులు
5. రుమాటిక్ ఫీవర్–14 ఏళ్లలోపు పిల్లలకు వచ్చే జ్వరం
6. కార్డియాక్ ఫెయిల్యూర్ – గుండె జబ్బులు
7. ఆస్టియో ఆర్థరైటిస్ – కీళ్ల నొప్పులు
8. గౌట్ ఆర్థరైటిస్ – కాలి వేళ్లు, చేతి వేళ్లు పొంగడం
9. సోరియాసిస్ – చర్మంపై మచ్చలు, చర్మ పొట్టురాలడం
10. క్రానిక్ హెపటైటిస్ – కాలేయ సంబంధిత వ్యాధి
11. సిరోసిస్ – కాలేయ సంబంధిత తీవ్ర వ్యాధి
12. బ్రాంకియల్ ఆస్తమా – ఉబ్బస
13. కన్వల్సివ్ డిజార్డర్ – ఫిట్స్
14. డెమిన్షియా – వృద్ధాప్యంలో జ్ఞాపక శక్తి తగ్గిపోవడం
15. సైకిసిస్, ఇతర మానసిక వ్యాధులు
16. వాస్క్యులర్ ఆక్లుసివ్ డిజార్డర్ – పక్షవాతం, మూర్ఛ
17. ఎస్ఎల్ఇ, ఇతర కణజాల వ్యాధులు – చర్మ వ్యాధులు
18. ఇన్‌ఫ్లమేటరీ బౌల్ డిసీజ్ – పేగు వ్యాధులు
19. హీమోలిటిక్ డిజార్డర్ – రక్తం గడ్డగట్టకపోవడం వంటివి
20. న్యూరోపతీస్ పెరిఫెరల్ న్యూర్స్ ట్రైటిస్ – తిమ్మిర్లు
21. నెఫ్రాటిక్ సిండ్రోమ్ – చిన్న పిల్లల్లో కిడ్నీ సమస్యలు
22. క్రానిక్ కిడ్నీ వ్యాధులు
23. పార్కిన్‌సన్ డిసీజ్ – ముఖంలో భావాలు లేకపోవడం
24. కరోనరీ ఆర్థరీ డిసీజ్ – వృద్ధాప్యంలో గుండె జబ్బులు
25. అరిత్‌మియాస్ – గుండె ఎక్కువ, తక్కువ కొట్టుకోవడం

సంప్రదించాల్సిన ఫోన్ నంబరు
8333814484 (వైద్య మిత్ర)





ఒడ్డుకు చేరుకున్న అజయ్ సోమస్య మృతదేహం

డొంకూరు తీరంలో మృతదేహం లభ్యం

ఇచ్ఛాపురం: మండలంలోని డొంకూరు సముద్ర తీరం వద్ద ఒడిశా రాష్ట్రంలోని అస్కా గ్రామానికి చెందిన అజయ్ సోమస్య (22) మృతదేహం మంగళవారం లభ్యమైంది. గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో తీర ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం విషయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. దీంతో మృతుని తల్లిదండ్రులు డొంకూరు తీర ప్రాంతానికి చేరుకున్నారు. వారి నుంచి సేకరించిన వివరాలు మేరకు.... అస్కా గ్రామానికి చెందిన అజయ్ సోమస్య, దిలీప్ మహంతి చెన్నైలో భరత్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ఇటీవల గ్రామానికి వచ్చిన వీరు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. సోమవారం ఒడిశా గ్రామంలోని సున్నాపురం బీచ్ వద్దకెళ్లి స్నానం చేస్తుండగా అలలు తాకిడికి కొట్టుకుపోయారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే గాలింపు చర్యలు చేపట్టగా దిలీప్ మహంతి మృతదేహం లభించగా, అజయ్ మృతదేహం లభించలేదు. ఘటనపై ఒడిశా పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాగా ఆంధ్రా ప్రాంతంలోని డొంకూరు తీర ప్రాంతంలో లభ్యమైన మృతదేహాన్ని స్థానిక పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై ఒడిశా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

రోడ్డు ప్రమాదంలో గొర్రెలు మృతి

కోటబొమ్మాళి: మండలంలోని పాకివలస గ్రామానికి చెందిన కారాడ చిన్నవాడు గొర్రెల మందకు చెందిన మూడు గొర్రెలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాయి. చిన్నవాడు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కిష్టుపురం వద్ద గొర్రెలను మంగళవారం రోడ్డు దాటిస్తుండగా టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో మూడు గొర్రెలు అక్కడకక్కడే మృతిచెందాయి. ప్రమాదానికి కారణమైన కారును అక్కడ ఆపలేదు. దీంతో చిన్నవాడు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రన్న కానుకలు పంపిణీ

రణస్థలం: మండలంలోని కొవ్వాడలో సర్పంచ్ మైలపల్లి పోలీసు చేతులు మీదుగా రేషన్ డీలరు బడి తోటయ్య ఆధ్వర్యాన మంగళవారం చంద్రన్న సంక్రాంతి కానుకల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి పేదవాడూ సంక్రాంతి పండగ ఆనందంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



కానుకలు అందిస్తున్న సర్పంచ్, డీలరు

అప్రతిష్ట అంటగట్టేద్దాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టు నిర్మాణంతో వచ్చే క్రెడిట్‌ను పార్టీ, ప్రభుత్వ ఖాతాలోనూ... నిర్వాసితుల ఇళ్లను నేలమట్టం చేయడం ద్వారా వచ్చే అప్రతిష్టను అధికారుల ఖాతాలోనూ వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. శ్రీకాకుళం రూరల్ మండలం భైరిలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో రాష్ట్ర రవాణశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు, వ్యవహరించిన తీరు అందుకు అద్దం పడుతున్నాయి. వంశధార నిర్వాసిత గ్రామాల్లో ఒక్క ఇల్లూ లేకుండా కలెక్టర్, జెసి నేలమట్టం చేశారని, ఇందుకు వారికి కృతజ్ఞత తెలియజేసుకుంటున్నానని చెప్పుకొచ్చారు. దగ్గరుండి ఇళ్ళను నేలమట్టం చేసి, ప్రాజెక్టు పనులు ముందుకు సాగడానికి చక్కగా పనిచేశారంటూ ఏకంగా వారిని సన్మానించేశారు.


జాయింట్ కలెక్టర్‌ను సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

దీనిపై అధికారులు, ఉద్యోగులు, రాజకీయ నాయకుల్లో తీవ్ర చర్చ సాగుతోంది.

ప్రభుత్వానికి, పార్టీకి అప్రతిష్ట

వంశధార నిర్వాసితుల ఇళ్లను నేలమట్టం చేసి, వారిని బలవంతంగా గ్రామాల నుంచి వెళ్లగొట్టిన తర్వాత వారి పరిస్థితి దుర్భరంగా మారింది. తాత్కాలిక షెడ్లు, గుడారాల్లో ఎముకలు కొరికే చలిలో పిల్లాపాపలతో అత్యంత దయనీయమైన పరిస్థితుల నడుమ బతుకుతున్నారు. నిర్వాసితుల కన్నీళ్లు, కష్టాలపై పత్రికల్లో వస్తున్న కథనాలు జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. రాబోయే ఎన్నికల్లో వంశధార ప్రాజెక్టు అంశాన్ని ప్రచార అంశంగా మలుచుకొని లబ్ధి పొందుదామని భావిస్తే, ప్రభుత్వానికి అంతకంటే ఎక్కువ అప్రతిష్టను తెచ్చిపెట్టాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల తీరుపైనా విమర్శలు వెల్లువెత్తాయి. వంశధార నిర్వాసితుల విషయంలో జరిగిన నష్టాన్ని ఏదో విధంగా లేకుండా చేసుకోవడమో, తగ్గించడమో చేస్తే గానీ ప్రభుత్వానికి, పార్టీకి వాటిల్లిన నష్టం సమసిపోయే పరిస్థితి దరిదాపుల్లో కనిపించడం లేదు. దీంతో నష్ట నివారణ చర్యలకు సిద్ధమైనట్లుగా కనిపిస్తోంది.

మంత్రి చర్యలకు కంగుతిన్న నాయకులు

మంత్రి అచ్చెన్నాయుడు మాటల్లో మెలికను పరిశీలిస్తే, వంశధార నిర్వాసితుల విషయంలో వచ్చిన అప్రతిష్టను అధికారుల మీదకు నెట్టేశారనే విషయం స్పష్టమవుతోంది. మంత్రి ఏం మాట్లాడారంటే... 'వంశధార నిర్వాసితుల సమస్యలపై తాను 15 నుంచి 18 సార్లు సమావేశాలు నిర్వహించాను. యూత్ ప్యాకేజీ, ఇతర నిర్మాణాలకు డబ్బులు చెల్లించాలంటే రూ.465 కోట్లను విడుదల చేయించాను. మూడున్నర ఏళ్లు గడుస్తున్నా, ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు. ప్రాజెక్టు కూడా పూర్తి కాదేమో అన్న భయం కలిగింది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చాకచక్యంగా వ్యవహరించారు. గతంలో ఏ కలెక్టర్ కూడా చేయలేని పని ప్రస్తుత కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జెసి కె.వి.ఎన్ చక్రధరబాబు చేశారు. నిర్వాసిత గ్రామాల్లో ఒక్క ఇల్లూ లేకుండా దగ్గరుండి కూలదోయించారు. ప్రాజెక్టు పనులు ముందుకు సాగడానికి బాగా పనిచేశారు. వారికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని అన్నారు. అనూహ్యంగా వారిని సన్మానించేందుకు ఉపక్రమించారు. ఊహించని ఈ పరిణామానికి వేదికపై ఉన్నవారు, నిర్వాహకులు ఒక్కసారిగా కంగుతిన్నారు.

వ్యూహాత్మకంగా వ్యవహరించిన మంత్రి

వంశధార నిర్వాసితులకు సంబంధించి కలెక్టర్, జెసి వ్యవహరించిన తీరును సభలో ప్రస్తావించడం, అధికారులను సన్మానించడంలో మంత్రి అచ్చెన్నాయుడు వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ముందుగా సిద్ధం చేసుకున్న స్క్రిప్ట్ ప్రకారమే మంత్రి వ్యవహరించినట్లు కనిపిస్తోంది. మంగళవారం నాటి జన్మభూమి కార్యక్రమంలో కలెక్టర్, జెసిల సన్మానానికి సంబంధించి అసలే అజెండానే లేనట్లు సమాచారం. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించడం, లబ్ధిదారులకు పలు పథకాల కింద చెక్కులను అందజేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. వీరిని సన్మానించడానికేనా అన్నట్లు అవేవీ వద్దని మంత్రి అచ్చెన్నాయుడు సూచించడం... వారి సన్మానానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చారో తెలుస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని సన్మానించేందుకు తెచ్చిన పూలదండలు, శాలువాలను కలెక్టర్, జెసిలకు వేయడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు.

వంశధార నిర్వాసితుల దయనీయ పరిస్థితులపై సామాజికవేత్తలు, పాతపట్నం నియోజకవర్గ వైసిపి నాయకులతో పాటు అధికారులు, ఉద్యోగులు స్పందించారు. అధికారులు, ఉద్యోగులు నూతన సంవత్సర వేడుకల కోసం ఖర్చు చేయాల్సిన డబ్బులను నిర్వాసితుల కోసం వెచ్చించారు. నిర్వాసిత కుటుంబాలకు రెండేసి దుప్పట్లను అందించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించి కఠినంగా వ్యవహరించిన అధికారులు, వ్యక్తులుగా తమ మానవత్వాన్ని ప్రదర్శించారు. నిర్వాసితుల కన్నీళ్లకు, కష్టాలకు ప్రభుత్వం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులే దోషులుగా మిగిలారు.

తప్పు చేశారంటూ అన్ని వేళ్లు వారిపైనే చూపిస్తున్నాయి. దీని నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలా వ్యవహరించారా అనే చర్చ ప్రస్తుతం సాగుతోంది. వంశధార నిర్వాసితుల ఇళ్ల కూల్చివేత, వారిని బలవంతగా గ్రామాల నుంచి తరలింపు వంటి అంశాల విషయంలో ప్రభుత్వ ఆదేశాలు లేకుండా, జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న మంత్రి అచ్చెన్నాయుడు సూచనలు పాటించకుండా అధికారులే అంతా చేశారంటే ఎవరు నమ్ముతారని అంతా అనుకుంటున్నారు.

జనాగ్రహం

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన్మభూమి సభల్లో తొలిరోజు జనాగ్రహం ఎదురైంది. సోమవారం ప్రారంభమైన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పలుచోట్ల నిలదీతల పర్వం సాగింది. పింఛన్లు, రేషన్‌కార్డులపై లబ్ధిదారుల నుంచి అధికారులు తీవ్ర ఆగ్రహం చవిచూడాల్సి వచ్చింది. తమ సమస్యలను పరిష్కరించని జన్మభూమి సభలు ఎందుకంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారుల ముందు ప్రజలు అక్కసు వెళ్లగక్కారు. పాలకొండ, శ్రీకాకుళం నగరంలో తెలుగు తమ్ముళ్ల మధ్య గ్రూపుల పోరు జన్మభూమి సభల వేదికగా రచ్చకెక్కింది.

జన్మభూమి బహిష్కరణ

సీతంపేట : బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ మండలంలోని పెద్దపొల్ల, టిటుకుపాయి, పూతికవలస పంచాయతీల్లో సర్పంచ్‌లు, గ్రామస్తులు జన్మభూమి సభలను బహిష్కరించారు. తొలిరోజే ఇటువంటి పరిణామం ఎదురుకావడంతో అధికారులు కంగుతిన్నారు. సభల్లో అప్పటికే వేసిన కుర్చీలు ఖాళీగా ఉండడంతో, ఏం చేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకున్నారు. అధికారులందరూ హాజరై రెండు గంటలైనా గ్రామస్తులెవరూ రాకపోవడంతో ఐటిడిఎ పిఒ ఎల్.శివశంకర్ పూతికవలస పంచాయతీలోని వీధుల్లో తిరిగి మరుగుదొడ్లపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిక కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చిస్తే గిరిజనులు నష్టపోతారని చెప్పారు. ఇప్పటికే గిరిజనులు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపించిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఏజెన్సీలోని గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని పిఒ హామీనివ్వడంతో సభ ప్రారంభమైంది.

పింఛన్లపై నిలదీత

టెక్కలి : మండలంలోని తలగాం పంచాయతీ పరిధిలో పింఛన్ల కోసం 38 మంది దరఖాస్తు చేసుకుంటే, 19 మందికే మంజూరు కావడంపై గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీశారు. ఆర్‌డిఒ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపిపి మట్ట సుందరమ్మ వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా, వారు అంగీకరించలేదు. చివరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సీపాన హరిహరరావు జోక్యం చేసుకొని దరఖాస్తుదారులు తన వద్దకు వ్యక్తిగతంగా వస్తే సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

సంతకవిటి : మండలంలోని జిఎస్‌పురంలో నిర్వహించిన జన్మభూమిలో పింఛన్లపై గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీశారు. అర్హులకు పింఛన్లు అందడం లేదని మాజీ సర్పంచ్ విశ్వనాథంతో పాటు పలువురు లబ్ధిదారులు తహశీల్దార్ జి.సురేష్‌ను నిలదీశారు. ఇదే అంశంపై గత జన్మభూమిలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తలతంపర గ్రామంలో నిర్వహించిన సభలోనూ పింఛన్లపై ఎంపిడిఒ వేణుగోపాలనాయుడును గ్రామస్తులు నిలదీశారు. గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలన్నారు.

రచ్చకెక్కిన గ్రూపుల పోరు

పాలకొండ : మండలంలోని లుంబూరులో నిర్వహించిన సభ అధికార పార్టీ నాయకుల మధ్య ఘర్షణకు దారితీసింది. నాయకుల మధ్య చోటుచేసుకున్న తోపులాటలో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అర్హులైన వారికి పింఛన్లు అందడం లేదని, ఉన్న 150 పింఛన్లలో 60 తొలగించారని మాజీ సర్పంచ్ రౌతు సోంబాబు గ్రూపునకు చెందిన కార్యకర్తలు నోడల్ అధికారి, ఆర్‌డిఒ రెడ్డి గున్నయ్యను నిలదీశారు. అర్హత ఉన్నా, జన్మభూమి కమిటీల కక్షసాధింపుతోనే పింఛన్లు నిలుపుదల చేశారని చెప్పారు. సమస్యలు పరిష్కరించని సభలు ఎందుకని గ్రామస్తులు వారికి జత కలిశారు. ఆర్‌డిఒ వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా, వినిపించుకోలేదు. జెడ్‌పిటిసి సభ్యులు సామంతుల దామోదరరావు కలుగజేసుకొని అర్హులైన వారందరికీ పింఛన్లు ఇస్తామని చెప్పినా, వారు శాంతించకుండా నినాదాలు చేశారు. ఉప సర్పంచ్ వావిలపల్లి రమణ గ్రూపునకు చెందిన వారు పోటీగా నినాదాలు చేయడంతో వారి మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇరు గ్రూపులకు చెందిన ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ వాసునాయుడు సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నగరంలోని ఆదివారంపేటలో నిర్వహించిన జన్మభూమి సభ రసాభాసగా మారింది. పేదల ఇళ్ల మంజూరులో చోటుచేసుకున్న అక్రమాలపై టిడిపి డివిజన్ ఇన్‌ఛార్జి రాజారావు స్థానికులతో కలిసి ఇన్‌ఛార్జి నగర కమిషనర్ జి.వెంకటేశ్వరరావు, సహాయ కమిషనర్ జీవరత్నంతో పాటు టిడిపి నాయకులను నిలదీశారు. ఇళ్ల మంజూరుకు లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, ఆ జాబితాలను పక్కన పెట్టి కొందరు నాయకులు సొంత జాబితాలను తయారు చేసుకొని అర్హులకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రుణాలు మంజూరు చేస్తామని చెప్పి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించినా, ఇంతవరకు ఒక్కరికైనా రుణం మంజూరు కాలేదన్నారు. రుణానికి ముందే లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారని విమర్శించారు. ఎస్‌సి లబ్ధిదారులకు రుణ మంజూరులో టిడిపి నాయకుడు ఎస్.వి రమణ మాదిగ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో టిడిపి నాయకుల మధ్య అరుపులు, కేకలు చోటుచేసుకున్నాయి. టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ జోక్యం చేసుకొని సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. సమస్యలన్నీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

27 నుంచి విద్యుత్ కార్మికుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు వెల్లడించారు. నగరంలోని ఇందిరానగర్ కాలనీలో గల సిఐటియు జిల్లా కార్యాలయంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యాన బుధవారం నుంచి డివిజనల్ ఇంజినీరింగ్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 9వ తేదీన ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ముందు ధర్నా, 20 నుంచి కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు, 24 నుంచి విజయవాడలో నిరవధిక నిరాహారదీక్షలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఎన్నికల ముందు కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని వాగ్దానం చేసిన చంద్రబాబు, అధికారంలోకొచ్చాక ఆ హామీని విస్మరించారని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. పీస్ రేటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో కార్మికులను విలీనం చేసి, శాశ్వత ఉద్యోగులకు కల్పించిన అన్ని సౌకర్యాలూ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పి.దేవీప్రసాద్, కె.రామకృష్ణ, ఎస్.సుదర్శనరావు, జి.వి.ఆర్ మూర్తి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం టూర్ షెడ్యూల్ ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

హెలీకాప్టర్‌లో ఇచ్ఛాపురంలోని జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలీపాడ్ వద్దకు గురువారం మధ్యాహ్నం 1.50 గంటలకు చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గంలో ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభకు రెండు గంటలకు చేరుకుంటారు. 4.30 గంటల వరకూ స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. 4.35 గంటలకు రోడ్డు మార్గం ద్వారా జ్ఞానభారతి స్కూల్ ఆవరణలోని హెలీపాడ్‌కు చేరుకొని విశాఖపట్నం బయలుదేరి వెళ్తారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు


మునగవలసలో మాట్లాడుతున్న విప్ రవికుమార్


చంద్రన్న బాండ్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణ

ప్రభుత్వ విప్ కూన రవికుమార్

ప్రజాశక్తి-ఆమదాలవలస

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తొగరాం, చీమలవలస, మునగవలస, శైలాడ గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. మునగవలస గ్రామంలో పాల్గొన్న విప్ రవికుమార్ మాట్లాడుతూ చంద్రన్న బీమా కార్యక్రమం గ్రామంలో తక్కువగా ఉందని, సిబ్బంది పనితీరు మెరుగుపడాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి పూర్తిసమాచారం లేకుండా గ్రామసభలకు హాజరైతే సహించేది లేదని, పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిపి తమ్మినేని భారతమ్మ, మండల పార్టీ అధ్యక్షులు శేఖర్, ఎపిడి పంచాది రాధ, ఎంపిడిఒ హబీబ్, తహశీల్దార్ బాబ్జీరావు, రాష్ట్ర కనీసవేతనాల సంఘం బోర్డు డైరెక్టర్ కోట గోవిందరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు మెట్ట సుజాత, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘంలో...

పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అధ్యక్షతన ఒకటో వార్డు తిమ్మాపురం, 12వ వార్డు లక్ష్మీనగర్‌లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ బి.రాము, కౌన్సిలర్ సంపదరావు మురళీ, దుంపల శ్యామలరావు, పి.విద్యాసాగర్, పట్టణ మహిళా అధ్యక్షులు బోయిన సునీత, మేనేజర్ శ్రీనివాసరావు, బోర గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో 'జన్మభూమి'

బూర్జ : మండలంలో కాళపర్తి, గుత్తావల్లి, కొరగాం, వైకుంఠపురం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి బొడ్డేపల్లి సూర్యారావు, జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తుందని, ప్రతిఒక్కరు గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బగాది శ్రీరామ్మూర్తినాయుడు, సర్పంచులు హనుమంతు మీనాక్షమ్మ, ఎం.సత్యం, ఎంపిటిసి గండెం శ్రావణి, తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపిడిఒ రవీంద్రబాబు, ఎఒ పైడి లతశ్రీ, ఎపిఎం సాయిరాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న మండవిల్లి రవి

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాకుళం సిటీ

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి వైసిపి మీడియా సెల్ ఇన్‌ఛార్జి మండవిల్లి రవి రూ.లక్ష విరాళంగా అందించారు. మంగళవారం రవి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఇఒ వి.శ్యామలాదేవికి రూ.లక్ష చెక్కును అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 24న నిర్వహించే రథసప్తమి వేడుకల్లో యాత్రికులకు సౌకర్యం కల్పించడంలో భాగంగా ఏర్పాటు చేసే స్టీల్ బారికేడ్లుకు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఆలయ ఇఒ అభ్యర్థన మేరకు రూ.లక్ష విరాళంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రవి తల్లి మంగతాయారు, భార్య మీన, కుమార్తె మౌక్తిక, అందవరపు సూరిబాబు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాకుళం రూరల్

మండలంలోని రాగోలులో సోమవారం మృతిచెందిన పి.మార్కండేయులు కుటుంబానికి రూ.5 వేలు నగదును జన్మభూమి కమిటీ సభ్యులు గేదెల శ్యామలరావు పంపిణీ చేశారు. మిగిలిన మొత్తం మార్కెండేయులు నామిని పద్మావతి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఒ లక్ష్మీభాయి, బీమామిత్ర వెంకటమ్మ పాల్గొన్నారు.

నేడు సావిత్రిభాయి పూలే జయంతి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఆధునిక భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సేవలందించిన సావిత్రిభాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. మంగళవారం సంఘం రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, పట్టణ కేంద్రాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆయాకమిటీలకు సూచించారు.



మాట్లాడుతున్న చిరంజీవి నాగ్

ఓట్లు వేసినందుకు పశ్చాత్తాపం

ప్రజాశక్తి-శ్రీకాకుళం సిటీ

2014లో టిడిపికి ఓట్లు వేసి చంద్రబాబును గెలిపించినందుకు రాష్ట్ర ప్రజలు పశ్చాత్తాపం పడుతున్నారని వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్మదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ విమర్శించారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రజలు ఓట్లు వేస్తే మూడున్నరేళ్లలో ఏమిటి సాధించారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన చంద్రబాబు రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేయకపోతే ప్రజలే సిగ్గుపడాలని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఓట్లు వేసినందుకు ప్రజలు సిగ్గు పడుతున్నారన్న విషయాన్ని చంద్రబాబు గ్రహించాలని హితవు పలికారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు ప్రజలు సిగ్గు పడాలా? అని ప్రశ్నించారు.

ఇసుక, మద్యం మాఫియాను పెంచినందుకు, దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తున్నందుకు చంద్రబాబే సిగ్గు పడాలని విమర్శించారు. ప్రాజెక్టుల అంచనాలు పెంచి ప్రజా ధనాన్ని దోచుకుంటున్న చంద్రబాబు సిగ్గుపడే రోజులు దగ్గర పడుతున్నాయన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించడం ఘనకార్యంగా ప్రచారం చేసుకుంటున్న చంద్రబాబు సిగ్గుపడాలన్నారు. సమావేశంలో కోరాడ రమేష్, ఎంవి స్వరూప్, పి.అశోక్, రామారావు పాల్గొన్నారు.

జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు అన్యాయం

శ్రీకాకుళం సిటీ : అఖిల భారత వైద్య మండలిని రద్దు చేసి దాని స్థానంలో నూతనంగా జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం ఐఎంఎ సభ్యులుగా ఉన్న వైద్యులంతా ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఒపిని రద్దు చేసి నిరసన తెలిపారు. అత్యవసర సేవలను మాత్రమే నిర్వహించి మిగతా వాటిని పూర్తిగా రద్దు చేసుకున్నారు. ఈ సందర్భంగా రిమ్స్‌లో వైద్యులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఐఎంఎ నగర అధ్యక్షులు డాక్టర్ ఎం.చిన్నబాబు, కార్యదర్శులు డాక్టర్లు బి.సాయిరాం, ఎస్.నర్శింహమూర్తి, హెచ్.రమేష్ మాట్లాడారు. జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు వల్ల ఆయుర్వేద, హోమియో వైద్యులంతా ఒక సంవత్సరం సాధారణ శిక్షణ పూర్తి చేసిన తర్వాత అల్లోపతి వైద్యం చేసేందుకు అనుమతిస్తారని అన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని విమర్శించారు. ఎంబిబిఎస్ ఉత్తీర్ణత సాధించిన వారు ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ప్రాక్టీస్‌కు అనుమతిస్తారని అన్నారు. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయం అనాలోచితమని విమర్శించారు. ర్యాలీలో రిమ్స్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ రిప్స్ మద్దతు

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శ్రీకాకుళం మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో ఐఎంఎ వైద్యులకు మద్దతుగా పాల్గొన్నారు. అఖిల భారత వైద్య మండలిని రద్దు చేసి దాని స్థానంలో నూతనంగా జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు చేసి వైద్యాన్ని ప్రయివేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ర్యాలీలో యూనియన్ ప్రతినిధులు డి.మారుతీ ప్రసాద్, జి.సతీష్‌కుమార్, బి.దేవీకిరణ్, డివిటి రాజు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

విశ్వమానవ కల్యాణమే ఆశయం

ప్రజాశక్తి-శ్రీకాకుళం రూరల్

విశ్వమానవునిగా, శాస్త్రవేత్తగా హయినిస్టిన్ తన ఆవిష్కరణల్లో ముఖ్యంగా ఇఇజిక్వెల్ట్ ఎంసిస్కేర్ సూత్రం ద్వారా విశ్వమానవ కల్యాణాన్ని ఆశించారని భౌతిక శాస్త్ర అధ్యాపకులు కె.చిన్నబాబు అన్నారు. మండలంలోని మునసబుపేట గాయత్రి కాలేజీలో 166వ ఇంటరాఫ్యాకల్టీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం చిన్నబాబును సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పులకండం శ్రీనివాసరావు, శ్రీనివాస్‌బాబు, హనుమంతుబాబు పాల్గొన్నారు.


చిన్నబాబుకు షీల్డు అందజేస్తున్న శ్రీనివాసరావు


పెద్దజొన్నవలస పంచాయతీ భవనం ఎదురుగా ఉన్న అక్రమ నిర్మాణం

దర్జాగా... కబ్జా

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ఆమదాలవలస

ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు ఎలా కబ్జా చేయాలన్న ఆలోచనలు గ్రామ పెద్దల వద్దకు వెళ్లడం, ఎంతో ముట్టజెప్పడం, ఆక్రమించుకోవడం ఇదంతా అధికారుల కనుసైగల్లో జరుగుతుంది. ఇందుకు ప్రధాన సూత్రదారులు గ్రామ పరిపాలన అధికారులేనని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని పెద్దజొన్నవలస పంచాయతీ భవనం ఉన్న ఖాళీ ప్రదేశాన్ని గ్రామానికి చెందిన కొందరు దర్జాగా కబ్జా చేశారు. అధికార పార్టీకి చెందిన వారు పక్కాగా నిర్మాణం చేపట్టి దుకాణం పెట్టి వ్యాపారం చేస్తుంటే ప్రతిపక్షపార్టీ వారు వెదురుబొంగులతో పాకలు వేసుకున్నారు. ఇదంతా గ్రామ పరిపాలన అధికారులకు తెలిసి కూడా పట్టించుకున్న పరిస్థితులు లేవు. పంచాయతీ భవనం స్థలం ఆనుకుని ఇదంతా జరుగుతున్నా ఎందుకు అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఆక్రమించి భవనం నిర్మించినంతవరకూ అధికారులు ఎందుకు కళ్లు మూసుకుంటున్నారో పలు సందేహాలకు తావుతీస్తుంది. రాజకీయ ఒత్తిడిలా? కబ్జాదారుల చేతివాటమా? అన్న పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
బుధవారం
3-1-2018

వికలాంగులకు భరోస భవిత



వికలాంగులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- టెక్కలి

అంగవైకల్యం శాపం కాకూడు. ఆ అంగవైకల్యాన్ని జయించాలనుకోవడం మానవ విజయం. అంగవైకల్యంతో బాధపడే ఎందరో చిన్నారులకు ప్రభుత్వం కల్పించే సౌకర్యం భవిత కేంద్రం. వికలాంగులుగా నమోదై పాఠశాలకు దూరంగా బతుకుతు చదువుకోవాలనే తపన ఉంది. పాఠశాలల్లో తోటి విద్యార్థులు తమలను దూరంగా ఉంచడంతో మానసిక ఆవేదనకు గురైన ఎందరో బాలలకు బాసటగా నిలుస్తుంది భవిత కేంద్రాలు. జిల్లాలో సుమారు పదికి పైబడి ఏర్పాటైన కేంద్రాల ద్వారా సుమారు వందలాది మంది వికలాంగులు బడిబాట పడుతున్నారు. ప్రభుత్వ సంకల్పం సిద్ధించడంతో భవిత కేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆలోచనలో ఉంది.

భవిత కేంద్రం అంటే

గ్రామాల్లో అంగవైకల్యంతో బాధపడే విద్యార్థులు పాఠశాలకు దూరంగా ఉంటారు. అంగవైకల్యం పుట్టుకతో ఇచ్చిన శాపమైతే... తోటి విద్యార్థులు అదే అంగవైకల్యంతో ఆటపట్టించడంతో మానసికంగా బాధపడే చిన్నారులకు విద్యను అందివ్వాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసినవే ఈ భవిత కేంద్రాలు. జిల్లాలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యాన ప్రత్యేక బృందం అంగవైకల్యం కలిగిన పిల్లలను గుర్తిస్తారు. సుమారు 21 రకాల వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులను చేర్చుకుని వారికి ఆశ్రయాన్ని కల్పిస్తారు. ఈ కేంద్రాల్లో విద్యార్థులకు వయస్సుతో సంబంధం లేకుండా కేంద్రాల్లో చేర్చుకుంటారు. ముందుగా వారి మానసిక పరిస్థితిని కేంద్రం నిర్వాహకులు అర్థం చేసుకొని వారితో మమేకమై ఆటపాటల ద్వారా అక్షరంపై అవగాహన కల్పించి విద్యలో ఓనమాలు నేర్పిస్తారు. అనంతరం వారి పూర్వజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని సమీపంలోని పాఠశాలల్లో ఆయా తరగతుల్లో జాయిన్ చేస్తారు. ఒక్కో విద్యార్థి మానసికర పరిస్థితిని బట్టి వారిని తీర్చిదిద్దడానికి ఒక్కోసారి ఏడాది సమయం కూడా అవసరం అవుతుంది. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కేంద్రంలోనే వికలాంగుల విద్యార్థులకు బోధన జరుగుతుంది. సాధారణ పాఠశాల విద్యార్థులకు మాదిరిగానే వీరికి కూడా ఆటపాటలతో చదువును అందిస్తూ మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని కూడా కల్పిస్తారు. ప్రతి వారమూ ఒక ప్రభుత్వ ఫిజియో థెరఫిస్ట్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో నూతనోత్సాహాన్ని కలిగిస్తారు. ప్రధానంగా భవిత కేంద్రాల లక్ష్యం మేరకు వారిని తీర్చిదిద్దే క్రమంలో ఒక్కోసారి నిర్వాహకులకు తలనొప్పి కలిగే ఘటనలు కూడా చోటుచేసుకుంటుంటాయి. వికలాంగ విద్యార్థులు చేసే అల్లరి పనులు ఒక్కోసారి నిర్వాహకులకు ముచ్చెమటలు పట్టించడమే కాకుండా ప్రాణాపాయ పరిస్థితులు కూడా ఏర్పడుతుంటాయి. నిర్వాహకులు విద్యార్థు ల మానసిక స్థితిని దృష్టిలో పెట్టుకుని వారితో స్నేహభావంతో మెలిగి వారిలో మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తారు. జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, నరసన్నపేట, పొందూరు, కంచిలి, పలాస, పాలకొండ, కొత్తూరు, సోంపేట, బూర్జ, పాతపట్నం మండల కేంద్రాల్లో ఉన్న భవిత కేంద్రాల్లో 76 మంది విద్యార్థిని, విద్యార్థులు తీర్చిదిద్దబడుతున్నారు. ఇందుకు గానూ 13 మంది ఫిజియో థెరఫిస్టులను ఏర్పాటు చేశారు. వీరితో పాటు ఓ సైకాలజిస్టు, ఆడియాలజిస్టును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాకే తలమానికం

సర్వశిక్షాఅభయాన్ ఆధ్వర్యాన నడుస్తున్న భవిత కేంద్రాలు జిల్లాకే తలమానికంగా నిలుస్తున్నాయి. సుమారు నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ఫలితాలను చూపిస్తుండడంతో దేశస్థాయిలో శ్రీకాకుళం జిల్లా గుర్తింపును సంపాదించుకుంది. గతేడాది డిసెంబరు నెల 3వ తేదీన ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా భవిత కేంద్రాల నిర్వహణ ప్రథమస్థానంలో నిలవడంతో దేశ రాజధాని డిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ చేతుల మీదుగా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, ఎస్ఎస్ఎ పిఒ త్రినాథరావు, సహాయ కో-ఆర్డినేటర్ కొరివి శ్రీనివాసరావులకు పురస్కార బహుమతిని అందుకున్నారు.

ఎంతో ఉపయోగం



మానసిక పరిస్థితి బాగులేని విద్యార్థులకు విద్యాశాఖ ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. బడిబయట బాలబాలికలను గుర్తించే క్రమంలో గ్రామాల్లోని అంగవైకల్యం పిల్లలను గుర్తించి కేంద్రాలకు అప్పగించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాం. ప్రతి మండల కేంద్రాల్లోనూ భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి అందుబాటులో ఉంచితే బాగుంటుంది.

- హనుమంతు రాజేష్, సిఆర్‌పి, రావివలస

ఆనందంగా ఉంది



గ్రామాల్లో మా అవయవలోపాన్ని చూసి చాలా మంది మాతోటి సహచరులు ఎగతాలి చేస్తుండడంతో బాధగా ఉండేది. చదువుకోవాలని అనిపించినా పాఠశాలకు వెళ్ళలేని పరిస్థితిలో భవిత కేంద్రాలు మాలాంటి విద్యార్థుల కోసం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. ఇల్లు మాదిరిగానే ఇక్కడ ఉండడంతో మాకు సంతోషంగా

- శశికాంత్, భవిత కేంద్ర విద్యార్థి, టెక్కలి

అవగాహనతో విద్య నేర్పిస్తున్నాం



భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థుల మానసిక పరిస్థితి సాధారణ విద్యార్థులతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ఇందుకు విద్యార్థులను అవగాహన చేసుకుని వారికి అవసరమైన రీతిలో విద్యాబోధనకు కృషి చేస్తున్నాం. మూడు భాషల్లోనూ ప్రాథమిక పూర్వజ్ఞానాన్ని అందించేందుకు కృషి చేసే క్రమంలో విద్యార్థుల నుంచి పలు ఇబ్బందులు కలుగుతున్నప్పటికీ వాటిని అర్థం చేసుకుని జ్ఞానం వైపు తీసుకువెళ్తున్నాం. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశాం. విద్యార్థుల మానసికస్థితికి అనుగుణంగానే కేంద్రాలను నిర్వహిస్తున్నాం.


- చమళ్ళ దశరథ, కేంద్ర నిర్వాహకులు, టెక్కలి

వలస పక్షులొచ్చేస్తున్నాయి

ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసపోయి జీవిస్తున్న వారంతా ప్రస్తుతం సంక్రాంతి పండగ దగ్గర పడుతుండడంతో స్వగ్రామాలకు తరలి వస్తున్నారు. నెలలు తరబడి వెళ్లిపోయిన వారంతా తిరిగి వస్తుంటే ఆయా కుటుంబాల్లో ఆనందహేళ నెలకొంది. వారి వారి స్వగ్రామాల్లో అయితే సందడే సందడి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి శోభ ఇప్పడిప్పడే చోటు చేసుకుంటుంది.

- ప్రజాశక్తి, రాజాం

- కుటుంబాల్లో ఆనందహేల
- స్వగ్రామాల్లో సందడే సందడి
- గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి శోభ




వడివడిగా అడుగులు వేసుకుంటూ ఇంటికెళ్తున్న కుటుంబం



వస్తు సామగ్రితో తరలివస్తున్న మహిళలు

శ్రీకాకుళం జిల్లా పూర్తిగా వెనుకబడిన జిల్లాగా పేరుగాంచిన విషయం అందరికీ తెలిసిందే. పాడి పంటలు, వ్యవసాయం అంతంత మాత్రమే. పరిశ్రమలు సైతం ఆశించిన స్థాయిలో లేవు. దీంతో ఉపాధి దొరకడం అతి కష్టంగా ఉంది. ఒక వేళ దొరికినా వచ్చే వేతనంతో పూట గడవడమే కష్టం. ఈ తరుణంలో అధిక వేతనంతో పాటు అనువైన ప్రాంతం దొరికే చోటుకి వలస పోవాల్సిన ఆవశ్యం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలోనే జిల్లా నుంచి సుమారు 20 వేల కుటుంబాలు వరకూ వలసపోయి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రధానంగా మద్రాస్, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఒడిశా తదితర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్తుంటారు. వీరంతా శ్రీకాకుళం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే. ప్రధానంగా రాజాం, పాలకొండ, ఎచ్చెర్ల ప్రాంతాలకు చెందిన వారే అధిక సంఖ్యలో వలస వెళ్లిన వారు ఉంటారు. వలస వెళ్లకుండా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పెట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో పనులు దొరక్కపోవడం, దొరికినా వేతనం అంతంత మాత్రంగా రావడంతో లక్ష్యం నీరుగారిపోయి పక్కదోవ పట్టేసింది. దీంతో ఏటా కుటుంబంలో వృద్ధులు, చిన్నారులు మినహా మిగిలిన వారంతా వలసపోవాల్సిన పరిస్థితి నెలకొంది. పండగ అనంతరం వెళ్లిపోయి తిరిగి సంక్రాంతికి ముందు రావడం ఆనవాయితీగా మారిపోయింది. ఈ నేపథ్యంలోనే మరో 15 రోజుల్లో సంక్రాంతి పండగ రానున్న దృష్ట్యా వలస పక్షులు తండోపతండాలుగా దిగబడుతున్నాయి.



రాజాం నియోజకవర్గం నుంచి ఏటా సుమారు నాలుగు వేల కుటుంబాలు వలస పోతుంటాయని అధికారుల అంచనా. ఇందులో రాజాం మండలం పరుశురాంపేట, గురవాం, బొద్దాం, పొగిరి, మొగిలివలస, అంతకాపల్లి, బొమ్మినాయుడువలస, ముద్దాడజోగివలస, కొత్తపేట, ఏగిరెడ్డిపేట తదితర గ్రామాల నుంచి వలసలు అధికంగా ఉంటాయి. సంతకవిటి మండలం నుంచి పొనుగుటివలస, బొద్దూరు, జి.ఎస్.పురం, లింగాపురం తదితర గ్రామాలకు చెందిన వారు అధికంగా వలస వెళ్తుంటారు. రేగిడి, వంగర మండలాల నుంచి కూడా అత్యధికంగా వలసలు ఏటా ఉంటాయి. వీటి నివారణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాల్సి ఉన్నా, ఆ దిశగా ఆలోచించకపోవడంతోనే ఈ దౌర్భాగ్యపు స్థితి నెలకొంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉపాధి లేకే వలసబాట...



శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఉపాధి అంతంతమాత్రంగానే ఉంది. మద్రాస్ వంటి ప్రాంతాల్లో నిత్యం పని దొరుకుతుంది. రోజుకి రూ. 500లు సంపాదించుకోవచ్చు. దీంతో ఐదేళ్లగా కుటుంబంతో సహా వలసబాట పడుతూనే ఉన్నాం.

- పిన్నింటి వెంకటరమణ, రాజాం

ఇక్కడ వచ్చే కూలి చాలడం లేదు...



ఇక్కడ వచ్చే కూలి చాలడం లేదు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. వలసపోతే రోజుకి రూ.400లు వస్తోంది. ఖర్చులు పోనూ రూ.200లు మిగిలుతోంది. రాజాంలో అయితే రోజుకి రూ.100లు మాత్రమే వస్తుంది. ఇలా నాలుగేళ్లగా ఇలా వలస పోతూనే ఉన్నాం.

- మారోతు చిన్నమ్మడు, పొనుగుటివలస

చెవి ఇన్ఫెక్షన్ల నియంత్రణకు అద్భుతమైన పద్ధతులు



వెచ్చని కాఫీ సమయాలకు శీతాకాలం అందంగా కనిపించ వచ్చు. కానీ, అదొక్కటే కాదు. వణికించే చలితోపాటు, శీతాకాలం అనేక ఇన్ఫెక్షన్లు, రోగాలను కూడా వెంటబెట్టుకు వస్తుంది. సరైన సమయంలో వాటికి సంరక్షణ తీసుకోకపోతే, అవి తీవ్రమైన ఆరోగ్య సమస్యలుగా మారే అవకాశం ఉంది. మొదటగా, చలికాలంలో చెవి ఇన్ఫెక్షన్లు ఎందుకు పెరుగుతాయో తెలుసుకుందాం.

- ప్రజాశక్తి, శ్రీకాకుళం

ఆరోగ్యం

ఇది ముఖ్యంగా చెవుల్లో సున్నితత్వం ఎక్కువగా ఉండి, చలికి, చలిగాలి తగిలినప్పుడు మరింతగా పెరుగుతుంది. అది చికాకును పెంచి, లోపల పేరుకునే తేమ, బ్యాక్టీరియా తీవ్ర నొప్పి స్థితిని కలుగచేస్తుంది. దీన్ని ఓటిటిస్ మీడియా (మధ్య చెవిలో వాచే వ్యాధి) అంటారు. చలికాలంలో చెవి ఇన్ఫెక్షన్లను ఎలా నివారించాలి. అయితే ఏమవుతుందంటే, ఇన్ఫెక్షన్ సోకిన పదార్థం యూస్టాషియన్ ట్యూబ్‌కు అడ్డం పడి, కర్ణభేరి వెనకాల పెరగడం ప్రారంభిస్తుంది. ఇది చాలా నొప్పి ఇన్ఫెక్షన్ పెరిగేలా చేస్తుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. సరైన సమయంలో సంరక్షణ తీసుకోకపోతే చెవుడుకి కూడా దారితీయవచ్చు. అందరికన్నా పిల్లల్లో ఇది తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఎందుకంటే పెద్దవారిలో కన్నా వారి యూస్టాషియన్ ట్యూబ్ చిన్నగా, అడ్డంగా ఉంటుంది. తీవ్ర చెవినొప్పి, వినికిడి సమస్యలు, చెవుల్లోంచి చీము, రక్తం కారడం, చెవుల్లో గింగురుమంటూ శబ్దాలు, జ్వరం, ఆకలి తగ్గిపోవడం వంటివి పెద్ద చెవి సంబంధ ఇన్ఫెక్షన్ల లక్షణాలు. ఇవి ముఖ్యంగా శీతాకాలాల్లో వస్తాయి. చలికాలాల్లో చెవి ఇన్ఫెక్షన్లను నివారించుకోవడానికి ఇక్కడ కొన్ని పద్ధతులు వివరించాం.



చెవిని పొడిగా ఉంచాలి

చెవులను వెచ్చగా, పొడిగా ఉంచుకోండి బయటకి వెళ్లినప్పుడు ముఖ్యంగా మీ చెవులను మూసి ఉంచుకోవాలని గుర్తుంచుకోండి. వణికించే చలిగాలుల మధ్య మీ చెవుల్లో చేరే తేమ, బ్యాక్టీరియా వల్ల చికాకు, నొప్పి కలగవచ్చు. అందుకని చెవులను ఎప్పుడూ వెచ్చగా, పొడిగా ఉంచుకోండి.

పొగాకు దూరంగా ఉండండి

పొగ తాగకండి పొగతాగడం ఆరోగ్యానికి హానికరం. అదీ ముఖ్యంగా చలికాలంలో మరింత ఎక్కువ. పొగతాగడం వల్ల యూస్టాషియన్ ట్యూబులో వాపు వచ్చి వినికిడి సమస్య తలెత్తవచ్చు. సరైన సమయంలో గుర్తించకపోతే, శాశ్వతంగా చెవుడు రావచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం మంచి ఆరోగ్యకర ఆహారం చాలా ముఖ్యం. అదీ చలికాలం వస్తున్నప్పుడు. ఇది మీ రోగని రోధక శక్తిని పెంచి, మీ శరీరంపై అనేక ఇన్ఫెక్షన్ల దాడిని నియంత్రిస్తుంది. ఆరోగ్యకర ఆహారం రక్తప్రసరణను స్థిరంగా ఉంచి మిమ్మల్ని ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉంచుతుంది.

క్రమంగా వ్యాయామం...

క్రమంగా వ్యాయామం ఆరోగ్యకర ఆహారంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం తప్పనిసరి. ప్రత్యేకంగా చలికాలంలో మరింత ముఖ్యం. ఇది మంచి రక్తప్రసరణతో పాటు ఆరోగ్యంగా ఉంచుతుంది. వ్యాయామం అంటే జిమ్‌కి వెళ్లడం మాత్రమే కాదు. నడక, జాగింగ్, సైక్లింగ్ వంటివి రోజుకి కనీసం 30 నిమిషాల పాటైనా చేస్తే మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం

వ్యక్తిగత శుభ్రత మీరు ఆరోగ్యంగా ఉండి ఇన్ఫెక్షన్ల నుంచి దూరంగా ఉండాలంటే వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి. తినేముందు మీ చేతులు కడుక్కోవడంతో జలుబు, అలర్జీలకి దూరంగా ఉండవచ్చు. జలుబు, అలర్జీల వల్ల ద్రవాలు చెవిలో పేరుకుపోయి, చెవి ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. ఇది చెవినొప్పి కలుగ చేసి చెవి సరిగా వినపడదు.

మంచి నిద్ర, ఆహారం అవసరం

మంచి నిద్ర ఆరోగ్యకరమైన ఆహారమేకాక, మంచి నిద్ర కూడా మీ రోగనిరోధక శక్తిని బలంగా మార్చి, ఇన్ఫెక్షన్లను నియంత్రిస్తుంది. చెవి ఇన్ఫెక్షన్లు, చికాకు రాకుండా ఉండాలంటే జలుబు, దగ్గు, అలర్జీలు, ఫ్లూ జ్వరాలను దూరంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఒంట్లో బాలేని వారి చుట్టూ ఉండకండి. ఫ్లూ అంటుకునే జ్వరం. అందుకని జలుబు, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లతో బాధపడే వారి చుట్టూ ఉండకండి. ఎందుకంటే మీకు ఫ్లూ అంటుకుంటే, చెవి ఇన్ఫెక్షన్‌కు కూడా దారి తీయవచ్చు.

వైద్యుడిని సంప్రదించాలి

వైద్యుని సంప్రదించండి చెవిలో చికాకు, నొప్పి చాలా సమయం వరకు ఉండి తగ్గకపోతే, వైద్యుని సంప్రదించి అవసరమైన మందులు తీసుకోవడం మంచిది. అది అలా పట్టించుకోకుండా వదిలేస్తే మరింత తీవ్రమైన చెవి సమస్యలకి దారితీసి, చెముడు రావచ్చు.



ఒక్క క్లిక్... ఓటుహక్కు



సమాచారం

- ఆన్‌లైన్‌లోనూ నమోదు
- డ్రాఫ్ట్ ప్రచురణ తేదీ వరకు అవకాశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మన పాలకులను మనమే ఎన్నుకునే హక్కును రాజ్యాంగం కల్పించింది. ఓటు హక్కుతోనే మనకు సేవలు అందించే బాధ్యతను నచ్చిన పాలకులకు అప్పగిస్తాం. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న అత్యంత శక్తిమంతమైన ఆయుధం ఓటు. అందుకే ఓటు వజ్రాయుధం వంటిది. ఓటే దేశ భవిష్యత్తును, దేశ ప్రజల మనుగడను నిర్ణయిస్తుంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం తరచూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఓటు ప్రాధాన్యతను తెలియజేస్తూ సదస్సులు నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఓటు నమోదు కార్యక్రమం జరుగుతోంది.

జిల్లా వ్యాప్తంగా అర్హులైన యువత ఓటు నమోదు చేసుకోవడంతోపాటు చేర్పులు, మార్పులు, సవరణలకు కూడా అవకాశం కల్పించింది. ఇప్పటికే అధికారులు సంబంధిత బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించి నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. ఓటు నమోదు దరఖాస్తులను ఆయా గ్రామ రెవెన్యూ కార్యాలయాలు, మీ-సేవ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. సంబంధిత దరఖాస్తుల్లో పూర్తి వివరాలు పూరించి బిఎల్‌ఒ లేదంటే విఆర్‌ఒకు అందజేయాలి. గత నెల రెండు ప్రత్యేక ఆదివారాల్లో ఓటరు నమోదు కార్యక్రమాలను డిసెంబరు 17, 24 తేదీల్లో నిర్వహించారు. ఈ రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 5,672 మంది ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు.

నిర్ధారిత ధ్రువపత్రాల నకళ్లను అప్‌లోడ్ చేయాలి



ప్రస్తుతం పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అంతటా అంతర్జాల సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేకుండా భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఇందుకు డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు.సిఇఒఆంధ్ర.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్ తెరిచి ఇ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేసి ఫారం-6లో వివరాలు నింపి ఓటు నమోదు చేసుకోవచ్చు. ముందుగా నియోజకవర్గం ఎంపిక చేసుకుని ఫొటో అప్‌లోడ్ చేసి, వివరాలు నింపాలి. చిరునామా, వయసు నిర్ధరిత ధ్రువపత్రాల నకళ్లను అప్‌లోడ్ చేయాలి. చేర్పులు, మార్పులు, సవరణలు, బదిలీల కోసం సంబంధిత ఆప్షన్లను ఎంపిక చేసి ప్రొఫార్మా వివరాలు నమోదు చేయాలి. స్మార్ట్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌తో పాటు ఇసిఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటు హక్కు నమోదు చేయవచ్చు. అంతర్జాలంలో నమోదు చేసుకున్నవారి వివరాలను సంబంధిత బిఎల్‌ఒలు సేకరించి, నేరుగా వారి ఇళ్లకు వెళ్లి విచారణ చేసి అర్హులైతే ఓటు హక్కు కల్పిస్తారు.

ముసాయిదా వరకు గడువు

ప్రస్తుతం ఎన్నికల సంఘం ఇచ్చిన నియమావళి ప్రకారం ఓటు నమోదుకు డిసెంబరు నెలాఖరుతో గడువు పూర్తయింది. ఎన్నికల సంఘం ముసాయిదా జాబితా ప్రచురణ జనవరి 16 తేదీన చేయనుంది. 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తుది జాబితా ప్రచురించనున్నారు. అప్పటి వరకు ఓటు నమోదుతోపాటు మార్పులు, చేర్పులకు దరఖాస్తులు తీసుకొంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కూడా ఈ విషయాన్ని గమనించి ఓటు నమోదుకు విస్తత ప్రచారం నిర్వహించి, అర్హతగల ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుంది. కొత్త ఓటు నమోదుకు ఫారం-6, అభ్యంతరాలపై ఫిర్యాదు ఫారం-7, తప్పుల సవరణ ఫారం-8 , ఓటు బదిలీ ఫారం-8ఎ దరఖాస్తులను చేసుకునే వెసులుబాటు కల్పించారు.



చెరువులో చేప పిల్లలను విడిచిపెడుతున్న అధికారులు

చేపల పెంపకానికి చర్యలు

ప్రజాశక్తి- పాలకొండ

మండలంలోని లుంబూరులో ఎస్‌డిపి నిధులతో చేపపిల్లలు కొనుగోలు చేసి స్వదేశీ మత్స్యపరిశ్రమ సహకారంతో మంగళవారం రూ.4 లక్షల చేప పిల్లలను చెరువులో పెంపకానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మత్స్యశాఖాధికారి గంగాధరరావు మాట్లాడుతూ చేపల పెంపకానికి అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. దీనిని సంఘ సభ్యులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లుంబూరు సర్పంచ్ తిర్లంగి అప్పారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, ఇఒపిఆర్‌డి ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

జిపిఎస్ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని పూతికవలస గ్రామంలో ఉన్న జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయులు జి.శ్రీరాములుదొరను పిఒ ఎల్.శివశంకర్ సస్పెండ్ చేశారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలకు మద్యం సేవించి రావడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు.

వంద మందికి వైద్య పరీక్షలు

వీరఘట్టం: మండలంలోని పనసనందివాడ, తలవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి ఎం.శృతి తెలిపారు. వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యమ్రకంలో సూపర్‌వైజర్లు శాంతికుమారి, జగదీశ్వరరావు, రామారావు, యోగేశ్వరరెడ్డి, ఎఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న కొండలరావు

మురుగునీరు పరిశీలన

పాలకొండ: నగర పంచాయతీలో వీవర్స్ కాలనీలో పాఠశాల వద్ద కాలువ నిర్మించాలని నగర పంచాయతీ అభివృద్ధి కమిటీ సమన్వయకర్త పల్లా కొండలరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం వీవర్స్ కాలనీలో పర్యటించిన కాలువ మూతపడి ఉండడంతో స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన వెంటనే స్పందించిన నగర పంచాయతీలో రూ.5 లక్షల నిధులతో అన్ని వార్డుల్లో కాలువల్లో పూడికతీతలు తీయిస్తామన్నారు. కాలువ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని రాజపురంలో ఈ నెల 3వ తేదీ నుంచి ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించనున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డివిఇఒ ఎం.ప్రకాశరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎం.అనురాధ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

'రైతు రథం' ప్రారంభం

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని తలవరంలో రైతు రథాన్ని తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ నిమ్మక పాండురంగ ప్రారంభించారు. ప్రభుత్వం సుమారు రూ. 7లక్షలతో ఈ పథకాన్ని పంపిణీ చేసిందని, రాయితీ రూ.1.50 లక్షలు ఇస్తుందని అన్నారు. వీటిని రైతులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఖండాపు వెంకటరమణ, మండల ప్రత్యేకాధికారి వై.వి.శ్యామ్‌కుమార్, తహశీల్దార్ ఎం.వి.రమణ, మాజీ ఎఎంసి చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఎంపిటిసి చందక సత్తిబాబు, చందక వెంకటరమణ, దేవకివాడ లక్ష్మణరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.



రైతు రథాన్ని ప్రారంభిస్తున్న జయకృష్ణ



వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి- కొత్తూరు

నిర్వాసిత గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని, తాగునీటి పథకం, విద్యుత్ ట్రాన్‌ఫార్మర్, శ్మశాన వాటికలు గ్రామానికి దూరంగా నిర్మిచంఆనలి సిపిఎం నాయకులు గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితులు ధర్నా చేపట్టారు. నిర్వాసిత గ్రామాల నుంచి పునరావాస కేంద్రాలకు సామన్లు తరలించేందుకు ఒక్కొక్క ఇంటికీ రూ.5వేలు ఇవ్వాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దౌర్జన్యంగా గ్రామాలను ఖాళీ చేయడం తగదన్నారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ బాలుకు వినతిపత్రం అందించారు. ధర్నాలో పి.కేశవరావు, రమణమ్మ, శారద, ఇందుమతి, పెంటమ్మ, మహాలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి- పాలకొండ

నగర పంచాయతీలో వెంకంపేటలో జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా 1,2 వార్డులకు సంబంధించి ఐసిడిఎస్ పరిధిలో ఆరుగురు గర్భిణులకు మంగళవారం సీమంతాలు నిర్వహించారు. నగర పంచాయతీ అధ్యక్షురాలు పల్లా విజయనిర్మల, ఉపాధ్యక్షురాలు సిరిపురపు చూడామణి, ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్ రామలక్ష్మి దగ్గరుండి సీమంతాలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అమరవేణి, సరస్వతి, శారద తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో డాక్టర్లు వద్దు... జన్మభూమి సభే ముద్దు...

డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఉండాల్సిన డాక్టర్లను ప్రభుత్వం జన్మభూమి గ్రామసభల్లో నియమించింది. రోజుకు 250 ఓపి ఉన్న ఈ ఆస్పత్రిలో 9 మంది వైద్యులున్నారు. అందులో రోజూ ఇద్దరు వైద్యులను జన్మభూమి సభలకు నియమించారు. దీంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా మంగళవారం



పాలకొండ... సీమంతాలు చేస్తున్న విజయనిర్మల

చిన్నపిల్లల వైద్యులు రవీంద్రకుమార్‌ను నియమించడంతో ఆస్పత్రిలో చిన్నారులకు వైద్యసేవలు అందలేదు. దీంతో పలు విమర్శలు వినిపించాయి. ప్రభుత్వం తీరు సరికాదని పలువురు ఆరోపిస్తున్నారు.

'తోటపల్లి' ఆధునికీకరణకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

పాలకొండ : తోటపల్లి ఎడమ కాలువ ఆధునికీకరణ పనులు విషయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వెంకంపేటలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో తోటపల్లి ఆధునికీకరణ సాధనసమితి ప్రతినిధి బృందం ప్రతినిధి బుడితి అప్పలనాయుడు, ఏరియా ఆస్పత్రి అధ్యక్షులు వెన్నపు శ్రీనివాసరావు, కోలా మూర్తి, నమ్మి కృష్ణ, నగర పంచాయతీ అభివృద్ధి కమిటీ సమన్వయకర్త పల్లా కొండలరావు తదితరులు నగర పంచాయతీ అధ్యక్షులు పల్లా విజయనిర్మలకు వినతిపత్రం అందించారు. రైతులకు ఎంతో అవసరమైన ఈ పనులు జరిగేలా చూడాలని వారు కోరారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఆమె హామీఇచ్చారు. గ్రామసభలో ఉపాధ్యక్షురాలు సిరిపురపు చూడామణి, కమిషనర్ బాలాజీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం : తహశీల్దార్ వేణుగోపాలరావు అధ్యక్షతన మండలంలోని తిడ్డిమి, రంకిణి పంచాయతీల్లో ఎంపిడిఒ బి.చిన్నమ్మడు బృందం రొంపివలస, రొమదలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ ఎం.అప్పారావు, పిఎసిఎస్ చైర్మన్ ఎం.శ్యామసుందరావు, టిడిపి నాయకులు కొంచాడ వీరభద్రరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



హిరమండలం... అధికారులతో మాట్లాడుతున్న లబ్ధిదారులు



సీతంపేట... మాట్లాడుతున్న పిఒ శివశంకర్

రక్షిత నీటి పథకం ప్రారంభం

మండలంలోని తిడ్డిమి పంచాయతీలో మంగళవారం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఇటీవల రూ.9.20 లక్షల నిధులతో నిర్మించిన రక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. రక్షిత తాగునీటి పథకం సద్వినియోగపర్చుకోవాలని, ఆపరేటర్ల పర్యవేక్షణ సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు పైల లక్ష్మయ్య, టిడిపి నాయకులు కొంచాడ వీరభద్రరావు, పైల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం : వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టిన వాటికి బిల్లులు చెల్లించడం లేదని పలువురు లబ్ధిదారులు అధికారులకు అడిగారు. మండలంలో జన్మభూమి కార్యక్రమం కొండరాగోలు, ఎం.ఎల్.పురం గ్రామాల్లో ఎంపిడిఒ వి.రామస్వామి, తహశీల్దార్ ఎం.కాళీప్రసాద్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల నుంచి పలు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి జి.లక్ష్మణరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సీతంపేట: మర్రిపాడులో నిర్వహించిన జన్మభూమిలో ఐటిడిఎ పిఒ ఎల్.శివశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐటిడిఎ పరిధిలోని27 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 24 గంటలుగా పెంచామన్నారు. అర్హులైన గిరిజనులకు సబ్సిడీ రుణం ఐటిడిఎ అందిస్తుందన్నారు. అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకపోతే ఐటిడిఎ టోల్‌ఫ్రీ నంబర్‌కు తక్షణమే ఫోన్ చేయాలన్నారు. అనంతరం చంద్రన్న ఉచిత కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణన్, పిఎఒ భవానీ శంకర్, ఐడబ్ల్యుఎంపి ఎపిడి లక్ష్మి, ఎంఇఒ ఆనందరావు, సర్పంచ్ హేమలత, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎపిడి రమణమ్మ పాల్గొన్నారు.

కొత్తూరు : ఎంపిడిఒ పి.రాజేవ్వరరావు అధ్యక్షతన బలద, కడుం, మెట్టూరు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బలదలో పింఛన్లు నిలిపివేయడంపై వృద్ధులు నిలదీశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డైసి, సర్పంచ్ భారతీదేవి, ధర్మారావు, గోవిందరావు, తహశీల్దార్ సావిత్రి పాల్గొన్నారు.

వీరఘట్టం : కట్టడానికి స్థలం లేదు మరుగుదొడ్డి ఎలా నిర్మించుకోవాలని మండలం పనసనందివాడ గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. మండలంలోని తలవరం, కుమ్మరిగుంట గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ, తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ నిమ్మక పాండురంగ, జన్మభూమి కమిటీ సభ్యులు ఖండాపు వెంకటరమణలు, తహశీల్దార్ ఎం.వి.రమణ, ఎంపిడిఒ ఎం.చంటిబాబు, మండల ప్రత్యేకాధికారి వై.వి.శ్యామ్ కుమార్, సర్పంచులు కొరికాన సన్యాసినాయుడు, చిట్టిబాబు, గుడివాడ నర్సమ్మ పాల్గొన్నారు.



పాతపట్నం... తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

వృత్తి నైపుణ్యం పెంపొందించుకొని పనులు వేగవంతమయ్యేలా సిద్ధం కావాలని అవుట్ సోర్సింగ్ సిబ్బందికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ కూన రామ్‌జీ ఉన్నారు. వర్సిటీలో పనిచేస్తున్న 77 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తి నైపుణ్యం లేని వారు ఎక్కువుగా ఉన్నారని తెలిపారు. వారిని ఉద్యోగం నుంచి


మాట్లాడుతున్న కూన రామ్‌జీ

తీసేయాలనేది తమ అభిమతం కాదని, అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, వర్శిటీ పురోగతికి తోడ్పాలని పిలుపునిచ్చారు.

లేకుంటే కఠిన చర్యలకు కూడా వెనుకాడనని స్పష్టం చేశారు. వివిధ డిపార్ట్‌మెంట్‌ల్లో మూడేళ్లకు మంచి సిబ్బంది పనిచేస్తున్నారని, ఇది మంచి పరిణామం కాదన్నారు. సమావేశంలో వర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపల్ పెద్దకోట చిరంజీవులు, ప్రొఫెసర్లు తమ్మినేని కామరాజు, బిడ్డిక అడ్డయ్య పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటి ఎన్ఎస్ఎస్ సభ్యులు

విస్తృతంగా ట్రిపుల్ ఐటి సేవా శిబిరాలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలోని జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యాన సేవా శిబిరాలను విస్తృతంగా చేపడుతున్నారు. మంగళవారం మూడు యూనిట్ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురంలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని, కుశాలపురంలో బహిరంగ మలవిసర్జనకు వ్యతిరేకంగా ర్యాలీ, ప్రచారం, రామ్‌నగర్, పొందూరు మండలం కేశవరావుపేటలో ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పర్యవేక్షణాధికారి ప్రొఫెసర్ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్, పౌర సంబంధాల అధికారులు రొట్ట గణపతిరావు, సతీష్‌కుమార్, శతావధాపి, రాంభట్ల పార్వతీశ్వరశర్మ పాల్గొన్నారు.


పూర్తయిన వంతెన

తుదిదశకు వంతెనల నిర్మాణం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని కుప్పిలి - బుడుగట్లపాలెంలో నిర్మిస్తున్న రెండు వంతెనల నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. రూ.14 కోట్ల వ్యయంతో ఆర్‌అండ్‌బి శాఖ నిర్మిస్తున్న ఈ వంతెనల్లో ఒకటి పూర్తయింది. అప్రోచ్ రోడ్డుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇది అధికారికంగా ప్రారంభంకాకపోయినప్పటికీ ఈ వంతెనలు రాకపోకలు సాగుతున్నాయి. మరో వంతెన పనులు 90 శాతం పూర్తయ్యాయి. దీంతో ప్రయాణికులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.


తుదిదశలో ఉన్న మరో వంతెన

ఉత్పత్తుల ఆధునికీకరణకు 'వర్సిటీ' అధ్యయనం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

జిల్లాలోని స్థానిక ఉత్పత్తులను ఆధునికీకరణ చేసి, ఉపాధి అవకాశాలను పెంచేందుకు అధ్యయనం చేయాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనిర్సిటీ బోధకులను వైస్‌ఛాన్సలర్ కూన రామ్‌జీ ఆదేశించారు. వర్సిటీలోని తన ఛాంబర్‌లో బోధకులతో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వెనుకబడిన జిల్లాలో లభించే వనరుల ద్వారా ఉపాధిని పెంచేందుకు బంగ్లాదేశ్‌కు చెందిన యూనస్ మైక్రోఫైనాన్స్ సంస్థతో చేసుకున్న ఒప్పందం, ప్రయోజనాలు, తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. బంగ్లాదేశ్‌లోని గ్రామీణ ప్రాంతంలో యూనస్ సంస్థ చేసిన కృషితో ఆయా ప్రాంతంలో ప్రజలు


మాట్లాడుతున్న రామ్‌జీ

ఆర్థికంగా బలోపేతమయ్యారన్నారు. ఈ సంస్థతో ప్రపంచంలోని 44 వర్సిటీలు ఒప్పందం చేసుకోగా, వాటిల్లో భారతదేశానికి రెండే ఉన్నాయని వివరించారు. యూనస్ అమలు చేసిన విధానాన్నే ఇక్కడ అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. జిల్లాలో జ్యూట్, పలాస జీడిపప్పు, గ్రానైట్‌తో పాటు అనేక వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి ఉత్పత్తిని ఆధునికీకరించడం ద్వారా వాటి వ్యాపారాన్ని పెంచవచ్చున్నారు. దీనికోసం ఏం చేయాలనే దానిపై అధ్యయం చేయాలన్నారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు.

'ఎల్ఐసి'లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి- రాజాం

స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం కార్యాలయానికి సెలవు దినం కావడంతో మంగళవారం సీనియర్ ఏజెంట్లతో పాటు కార్యాలయ సిబ్బంది సంయుక్తంగా బ్రాంచ్ మేనేజర్ వి.సూర్యమోహన్‌కు బోకేలతో హ్యాపీ న్యూ ఇయర్ తెలిపారు. అనంతరం ఎండిఆర్‌టి ఏజెంట్లంతా కలిసి మేనేజర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీఎం శ్రీరామ్మూర్తి, పీఎస్‌వీ కూర్మాసు,


బ్రాంచి మేనేజర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నగేష్ తదితరులు

ఎంవీసీకె నాగేశ్వరరావు, వి.సీతారాం, పి.అప్పలరాజు, పి.ప్రభాకర్, ఎం తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

5న ఉద్యోగాలకు ఎంపికలు

ప్రజాశక్తి- రణస్థలం

విశాఖపట్నానికి చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, క్రిస్టల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ఆధ్వర్యాన ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహిస్తామని డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు, ప్రిన్సిపల్ ఎస్.సతీష్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు ఫార్మా రంగంలో 35 రోజుల పాటు శిక్షణ అందించి ఉద్యోగాలవకాశాలు కల్పిస్తామన్నారు. వీరికి కనీస వేతనం రూ.8,500 నుంచి రూ.12 వేలు వరకు కల్పించనునన్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ సమయంలో భారత ప్రభుత్వంచే గుర్తించబడిన ధ్రువపత్రం అందజేస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి భోజన సదుపాయం ఉంటుదన్నారు. డిగ్రీ, ఇంటర్, ఐటిఐ, డిప్లమో చేసిన వారు అర్హులన్నారు. మిగతా వివరాలకు 9494447981 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విద్యుత్ శాఖ మంత్రి కళావెంకటరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని జరజాం, ఎస్.ఎస్.ఆర్.పురంలో జన్మభూమి కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జన్మభూమి పేరుతో రేషన్‌కార్డులు, పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి ఎంపిపి బల్లాడ వెంకటరమణారెడ్డి, మండల ప్రత్యేకాధిరాని జమదాగ్ని, సర్పంచ్ కోటేశ్వరప్రసాద్, పార్టీ మండలాధ్యక్షులు బెండు మల్లేశ్వరరావు, పైడి ముఖలింగం, గాలి వెంకటరెడ్డి, గాడు రామారావు, జీరు రామారావు, చౌదరి నారాయణమూర్తి పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని లోపెంట, లక్ష్మీపురం గ్రామాల్లో నోడల్ అధికారి రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళావెంకటరావు పాల్గొని ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం ఎన్‌టిఆర్ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశానే. పంచాయతీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. లక్ష్మీపురంలో సిసి రోడ్లు, అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెసి చక్రధర్‌బాబు, ప్రత్యేకాహ్వానితుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి ఛైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ఎంపిడిఒ ఎం.కిరణ్‌కుమార్, తహశీల్దార్ ఎస్.సుధాసాగర్, పి.మధుబాబు, సర్పంచ్ కొల్లి మల్లమ్మ పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని వి.ఆర్.అగ్రహారం, డోలపేట, బుచ్చెంపేట గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావలి ప్రతిభాభారతి, ఆమె తనయురాలు గ్రీష్మాప్రసాద్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో పనిచేయించుకోవడం మనహక్కు


రణస్థలం: ప్రభుత్వంతో ప్రజలు పనిచేయించుకోవడం మనహక్కు అని ఎంపిపి గొర్లె విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మహంతిపాలెం, కృష్ణాపురం, రావాడ, రణస్థలం గ్రామాల్లో జన్మభూమి–మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.ధర్మారావు, వైస్ ఎంపిపి దుమ్ము అశోక్, సర్పంచ్ గొర్లె అప్పలనర్సునాయుడు, ఎంపిడిఒ యు.కుమార్‌పట్నాయక్, డిటి టి.సత్యనారాయణ, ఇంఇఒ ఎ.త్రినాథరావు పాల్గొన్నారు.


వితరణ అందిస్తున్న వెంకటరావు

వికలాంగుడికి వితరణ

ప్రజాశక్తి- రాజాం

జి.సిగడాం మండలం పాలఖండ్యాంనకు చెందిన ఇజ్జి పోలారావు అనే వికలాంగుడికి రాజాంకు చెందిన వెంకీ ఒన్‌మేన్ ఆర్కెస్ట్రా గ్రూప్ సింగర్ బట్ట వెంకటరావు మంగళవారం రూ.3 వేలు వితరణగా అందించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ పోలారావు చిన్నప్పటి నుంచీ వికలాంగుడేనని తెలుసునని, అయితే ఇన్నాళ్లు పేదరికంతో ఎటువంటి సహాయం చేయలేకపోయానని అన్నారు. ఇటీవల సింగర్‌గా మారిన తరువాత ప్రొగ్రామ్స్‌లో వచ్చే వేతనంలో 30 శాతం డబ్బుని పేదలకు అందించాలనే సంకల్పంతో ముందుగా పోలారావుకు ఈ మొత్తాన్ని వితరణగా అందించానన్నారు. దీనిని మరికొంతమంది దాతలు స్ఫూర్తిగా తీసుకొని నిరుపేదలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొగిరికి చెందిన ఏనుగుతల త్రినాథ, బాడంగికి చెందిన నేదూరి దాలిబాబు, ఉప్పు అప్పలనాయుడు పాల్గొన్నారు.


లావేరు... మాట్లాడుతున్న మంత్రి కళావెంకటరావు


రణస్థలం... ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు


రాజాం... చంద్రన్న కానుకలు అందిస్తున్న ప్రతిభాభారతి

‘ఆదిత్య’కు ఐఎస్‌టిఇ అవార్డు

ప్రజాశక్తి–టెక్కలి

ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ) 2017 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఛాప్టర్ అవార్డుకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎంపికైంది. ఈ మేరకు ఐఎస్‌టిఇ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి అధ్యాపకులు విజయ్.డి వైద్య నుంచి లేఖ అందినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వివి.నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును ఈ నెల 28న కేరళ రాష్ట్రం (కొట్టాయం) సెయింట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో జరగనున్న 47వ జాతీయ ఐఎస్‌టిఇ వార్షిక సమావేశంలో అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కళాశాల అవార్డుకు ఎంపిక కావడం పట్ల కళాశాల డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపల్ డాక్టర్ కెబి.మధుసాహు హర్షం వ్యక్తం చేశారు.



లబ్ధిదారులకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

సంక్రాంతి కానుకలు అందజేత

ప్రజాశక్తి–కోటబొమ్మాళి

మండలంలోని హరిశ్చంద్రపురం కేంద్రం వద్ద లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలను సర్పంచ్ పూజారి శైలజాసత్యన్నారాయణ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడూ ఎటువంటి రుసుము లేకుండా చంద్రన్న సంక్రాంతి కానుకలను తీసుకోవాలని అమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పాడ రాజు, తదితరులు పాల్గొన్నారు.



పశువులకు వైద్యం చేస్తున్న ఎ.రామ్‌కుమార్

పశువులకు టీకాలు

ప్రజాశక్తి–కోటబొమ్మాళి

మండలంలోని నిర్వహిస్తున్న జన్మభూమి గ్రామ సభల్లో భాగంగా మంగళవారం సరియాపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిభిరంలో పశు వైద్యాధికారి ఎ.రామ్‌కుమార్ పశువులకు వ్యాధి నిరోధిక టీకాలు వేశారు. అలాగే పశువుల్లో చూడి, కృత్రిమ గర్భధారణ, సాధారణ వ్యాధులపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సభ్యులు, ఎంపిటిసి వెలమల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీమ్ మేనేజర్‌గా రమేష్

టెక్కలి: ఈ నెల 5,6,7 తేదీల్లో కర్ణాటక రాష్ట్రం మంగుళూరులో జరగనున్న జాతీయ స్థాయి లగోరి పోటీలకు టీం మేనేజర్‌గా రమేష్ ఎంపికయ్యారు. బూరగాం ఉన్నత పాఠశాలలో పిఇటిగా పని చేస్తున్నారు. ఈ మేరకు రమేష్‌ను జిల్లా పరిషత్ ఉపవిద్యాశాఖాధికారి బసవల అప్పలస్వామి, జిల్లా కార్యదర్శి బి.నారాయణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రఘునాథరావులు అభినందించారు.

వాస్తవాలు ప్రజలు గ్రహిస్తున్నారు

టెక్కలి వైసిపి సమన్వయకర్త

ప్రజాశక్తి–టెక్కలి

నియోజకవర్గంలో అభివృద్ధి ముసుగులో జరుగుతున్న పనుల వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. వైసిపి పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిలక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన పాత అంచనాలపై కొత్తవి వేయించి తన ముద్ర వేసుకోవడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధి అని చెబుతున్న మంత్రి మినీ స్టేడియం, హుదూద్ ఇళ్ళు, రైతు బజార్ ఎందుకు పూర్తి చేసుకోలేకపోతున్నారనీ, అభివృద్ధి అంటే రోడ్లే కాదని పేద, మధ్య తరగతి వారి అభ్యున్నతి అవసరంలేదా అని ప్రశ్నించారు. తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు, కార్యకర్తలకు పనులు అప్పగిస్తూ పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయిస్తున్నారని ఆరోపించారు. మంత్రి అండదండలతో అధికారులు తమ బాధ్యతలను సైతం మర్చిపోతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణలో ఎవరికి లాభం అని ఆయన సూటిగా ప్రశ్నించారు.



మాట్లాడుతున్న పేరాడ తిలక్

మూడు సంవత్సరాల క్రితం రూ.3.70 కోట్ల వ్యయంతో శ్యామసుందరాపురం జంక్షన్ నుంచి రవి డాబా వరకూ రోడ్డు విస్తరణ జరిగితే అదే రోడ్డు నిర్మాణానికి 80 అడుగుల పేరుతో రూ.14 కోట్లు రూపాయలు కేటాయించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న పోలవరం రోడ్డు గత ప్రభుత్వ హయాంలో మంజూరయిందని మంత్రి మర్చిపోయారా అని ప్రశ్నించారు. మంత్రి చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామనీ, త్వరలో మంత్రి అవినీతిపై ఆధారాలతో సహా గవర్నర్‌ను కలిసి నివేదిక అందజేయనున్నట్లు తిలక్ తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు తిర్లంగి జానకిరామయ్య, సత్తారు సత్యం, పుష్యా సత్యం, బగాది హరి, తమ్మనగారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

‘పద్మావతి’ విద్యార్థులకు

ఉత్తమ ఆవిష్కరణ అవార్డు

ప్రజాశక్తి–పోలాకి

స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్సు విద్యార్థులు బొంగు పద్మిని, రెడ్డి కవిత బెస్ట్ ఇన్నోవేషన్ అవార్డును దక్కించుకున్నట్లు ఆ కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్నోవేషన్ ఫెస్ట్ విర్ట్యుసా ప్రాజెక్ట్ ఎక్స్‌లో వీరు రూపొందించిన గన్‌షాట్ వీడియో గేమ్ ఉత్తమ ఆవిష్కరణగా ఎంపికైందని డైరెక్టర్ తెలిపారు. ఆంధ్ర యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు సురేష్‌ఖన్నా ఆధ్వర్యంలో ప్రశంసాపత్రంతో పాటు రూ.ఐదు వేలు నగదు బహుమతికి విద్యార్థినులను ఎంపికచేసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అధ్యాపకులు సురేష్‌ఖన్నా

ఐదో విడత ‘జన్మభూమి’ ప్రారంభం

ప్రజాశక్తి–కోటబొమ్మాళి

ఎంపిపి తర్ర రామకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని సరియాపల్లి, కొత్తపల్లిలో ఐదో విడత జన్మభూమి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఎంపిపి చేత అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వెలమల విజయలక్ష్మి, ఎంపిటిసి కామేశ్వరరావు, ఎంపిడిఒ ఎం. రేణుక, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీదేవి, సిఎస్‌డిటి బైరి.రాజు, పశువైధ్యాధికారి ఎ.రామకుమార్, ఉపాధి హామీ ఎపిఒ జి.హరిప్రసాద్, విద్యుత్‌శాఖ ఎఇ ఎం. చంద్రశేఖరరావు, ఎంఇఒ టి. నారాయణరావు, రాష్ట్ర జలవనరుల సంఘం డైరెక్టర్ కర్రి అప్పారావు, జడ్‌పిటిసి భర్త నంభాళ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ పాల్గొన్నారు.

అర్హతలు ఉన్నాయి... పింఛన్ ఇవ్వండి...

మండలంలోని సరియాపల్లి గ్రామానికి చెందిన పల్ల కసవయ్య (45) అనే అంధుడు తనకు అన్ని అర్హతలు ఉన్నాయనీ, ప్రభుత్వం నుంచి పింఛను ఇవ్వండి సార్ అంటూ మంగళవారం గ్రామంలో జరిగిన జన్మభూమి – మా ఊరు గ్రామసభలో అధికారులకు , ప్రజాప్రతిని ధులకు వేడుకున్నాడు. గత ఐదేళ్ళుగా స్థానిక సర్పంచ్‌కి, ఎంపిటిసికి, అధికారులకు పింఛన్ మంజూరు చేయాలని ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. డాక్టర్లతో ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లినా ఇప్పటి వరకు పింఛన్‌ను మంజూరు చేయలేదని వాపోయాడు. తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో తన జీవనం కష్టంగా ఉందన్నాడు. ఇప్పటికైనా అధికారులూ, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరాడు.



కసవయ్య

నందిగాం: టిడిపి మండల అధ్యక్షులు పినకాన.అజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఉయ్యాలపేట, హర్షబాద గ్రామాల్లో ఒక బృందమూ, తహశీల్దార్ ఎస్పీ నాగేశ్వరరావు, శివరామపురం,సైలాడ గ్రామాల్లో ఎంపిడిఒ రాంబాబు ఆధ్వర్యంలో మరో బృందమూ ఆధ్వర్యంలో జన్మభూమి–మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. సైలాడలో గ్రామానికి చెందిన విశ్రాంత ఐపిఎస్ అధికారి వేణు గోపాలకష్ణ మాట్లాడుతూ గ్రామంలో చాలా సమస్యలు వేధిస్తున్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. ఉయ్యాలపేట, శివరామపురం, సైలాడ గ్రామాల్లో వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బాలకష్ణ, అజయ్ కుమార్‌లు పాల్గొన్నారు. అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఎంపిడిఒ రాంబాబు మాట్లాడుతూ కొత్తగా సంక్షేమ పథకాలు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. హర్ష బాటలో తహశీల్దార్ నాగేశ్వరరావు మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మినారాయణ, మండల కో ఆర్డినేటర్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అనంతరావు, శ్రీనివాసరావు, సోమేశ్వరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలాకి: మండల ప్రత్యేక సలహాదారులు తమ్మినేని భూషణరావు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బెలమర,పాలవలస, డిఎల్‌పురం, ప్రియాగ్రహారం, గుల్లవానిపేట గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ అలివేలుమంగమ్మ ఆధ్వర్యంలో ప్రియాగ్రహారం, గుల్లవానిపేట పంచాయతీల్లో కార్యక్రమం నిర్వహించగా, తహశీల్దార్ జె రామారావు ఆధ్వర్యంలో బెలమర, పాలవలస, డిఎల్‌పురం పంచాయతీల్లో నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గొండు రామన్న, ఎఎంసి చైర్మన్ బి భాస్కరరావు, కిల్లి వేణు, స్థానిక సర్పంచ్‌లు లావేటి కృష్ణ, చింతు సుందరమ్మ, డోల ప్రసాదరావు, గుంట మల్లేశ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సారవకోట: అధికారులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

సారవకోట: మండలంలోని నాలుగు పంచాయతీల్లో నిర్వహించిన జన్మభూమిలో అధికారులు సమయపాలన సక్రమంగా పాటించకపోవడంతో గ్రామ సభలు తూతూ మంత్రంగా జరిగాయి. తహశీల్దార్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో అంగూరు పంచాయతీలో జరిగిన జన్మభూమికి ఆమె పది ముప్పై వరకు హాజరుకాకపోవడంతో ఆలస్యమైంది. గ్రామసభల్లో అధికారుల ప్రసంగానికే పరిమితమైంది. వెంకటాపురం పంచాయతీలో టిడిపి మండల అధ్యక్షులు వరుదు రాఘవ, బుడితి సభలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సాదు చిన్నకృష్ణారావు పాల్గొన్నారు.కార్యక్రమంలో ఐసిడిఎస్ నుంచి గర్భిణులకు సీమాంతాలు నిర్వహించారు. వెలుగు నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు, జన్మభూమి సభ్యులు పాల్గొన్నారు.

జలుమూరు: సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయనున్నట్లు మండల ప్రత్యేక అధికారి, డిఇఒ ఎం.సాయిరామ్ తెలిపారు. ఎంపిడిఒ పి.వాసుదేవరావు ఆధ్వర్యంలో మంగళవారం జోణంకి, చల్లవానిపేట పంచాయతీలలో “జన్మభూమి – మా ఊరు” కార్యక్రమానికి అతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబమూ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. స్వచ్ఛ గ్రామాలను నెలకొల్పాలనానరు. తహశీల్దార్ ప్రవళిక ప్రియ ఆధ్వర్యంలో లింగాలవలస, రాణ పంచాయతీలలో జన్మభూమిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వెలమల చంద్ర భూషణ రావు, మండల జన్మభూమి కమిటీ సభ్యులు బగ్గు గోవిందరావు, సర్పంచులు పంచిరెడ్డి లలిత కుమారి, దుంగ రమణమ్మ, తర్ర పార్థివ రావు, కూన వీరన్నాయుడు, గ్రామ జన్మభూమి కమిటీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన 'ఆఫ్‌షోర్' పూర్తి

ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ

ప్రజాశక్తి-పలాస రూరల్

త్వరితగతిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసి పంట భూములకు సాగునీరు అందించనున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ తెలిపారు. మండలంలోని టెక్కలిపట్నం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2017 ఏప్రిల్‌లో పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశాననీ, 2018 జనవరి నాటికి పూర్తి చేసి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఆఫ్‌షోర్ ద్వారా పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్ పి.విఠల్‌రావు, సర్పంచ్ సవర రామారావు, మండల టిడిపి ఉపాధ్యక్షులు ఎ.షణ్ముఖరావు, చంద్రశేఖర్ అధికారి, తిరుపతి రావు, దశరథ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న శివాజీ

ప్రారంభమైన 'జన్మభూమి' గ్రామసభలు

ప్రజాశక్తి-మందస

మండలంలో బుడారిసింగి, తాళ్లగురంటి, చీపి, బొగాపురం పంచాయతీల్లో తహశీల్దార్ ఎస్‌వి.శ్యామసుందరరావు, ఎంపిడిఒ పి.చంద్రకుమారి హాజరయ్యారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు అమరనాథ్, సునంద, ఇఒపిఆర్‌డి రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ మోహనరావు పట్నాయక్, ఎఒ పోలారావు, ఎఇఒ ఉదయకుమార్ పాల్గొన్నారు.

పలాస: జన్మభూమి-మా ఊరు కార్యక్రమం మంగళవారం ఉదయం 20,21వ వార్డుల్లో ఉదయపురం ప్రాథమిక పాఠశాల వద్ద, మధ్యాహ్నం 18,19 వార్డులకు సంబంధించి అన్నపూర్ణ ఆశ్రమం వద్ద గ్రామసభలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సభల్లో వైస్‌చైర్మన్ జి.సూర్యనారాయణ పాల్గొని ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం ఆయా వార్డుల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సభలో టిడిపి పట్టణాధ్యక్షులు ఎల్.కామేశ్వరరావు, టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గాలి కృష్ణారావు, మాజీ ఎంపిపి ఎన్.బైరాగి, కౌన్సిలర్లు నాగరాణిపాత్రో, మల్లా కృష్ణారావు, సూపరింటెండెంట్ పాపారావు, వార్డుల ఇన్‌ఛార్జులు ఐ.నరసయ్య, పి.మల్లేషు, వివిధ శాఖాధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస రూరల్: మార్చి నెలాఖరులోగా మరుగుదొడ్లు నిర్మించుకొని ఒడిఎఫ్ గ్రామంగా నిలవాలని అధికారులు స్పష్టం చేశారు. మండలంలోని అల్లుకోల, లొత్తూరు గ్రామాల్లో మంగళవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాన్ని జన్మభూమి రాష్ట్ర పరిశీలకులు కూన సూర్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణాలు చేపట్టడం ద్వారా గ్రామం అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. మరుగుదొడ్లు ప్రతి కుటుంబానికీ తప్పనిసరి అని తెలిపారు. తమ పంచాయతీలో ఉచిత విద్యుత్ అంటూనే బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖాధికారులు ఒత్తిడి తీసుకురావడం సమంజసంగా లేదని అల్లుకోల సర్పంచ్ భర్త పి.సూర్యనారాయణ అన్నారు. ఇదే విషయంపై అధికారులను నిలదీయడంతో ఆరు నెలలకు రూ.180 చొప్పున తప్పనిసరిగా చెల్లించాలని విద్యుత్ శాఖ ఎఇ ఆనందమురళీ స్పష్టం చేశారు. అనంతరం శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పలువురు లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, ఎంపిడిఒ సూర్యనారాయణ, తహశీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, సర్పంచ్‌లు పి.మోహనరావు, సవర మోహనరావు, జన్మభూమి కమిటీ సభ్యులు, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ఆధ్వర్యంలో మండలంలోని డొంకూరు తీర ప్రాంతంలో మంగళవారం ఐదో విడత జన్మభూమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. జన్మభూమి సందర్భంగా తీర ప్రాంతంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరం, ఉచిత వైద్య శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు నుంచి వినతులు స్వీకరించారు.

ముచ్చింద్ర, కొళిగాం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన మాదిరిగానే ఈదుపురం, ధర్మపురం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని దున్న లోకేష్, జానకిరావు కోరారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి లవరాజు, ఎఎంసి చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్‌పిటిసి లింగరాజురెడ్డి, సర్పంచ్ బి.కామాక్షి, ఎంపిటిసి కాంతమ్మ, ఎంపిడిఒ సత్యం తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తాగునీటి సమస్య పరిష్కరించరూ..

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 1,2,3 వార్డుల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, ఎన్ని జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించినా తమ సమస్యలు పరిష్కారం కావడంలేదని ప్రజలు వాపోయారు. మంగళవారం ఈ వార్డులకు సంబంధించి పురుషోత్తపురం గ్రామంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామస్తులు.... అధికారులు వద్ద మొరపెట్టుకున్నారు. అనంతరం అధికారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, ఎస్.ఢిల్లీ, పార్వతీశం, నాగరాజుపాత్రో, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, బి.నిర్మలారెడ్డి, నందిక జానీ తదితరులు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరులో పోర్టు వద్దంటూ అధికారి శ్రీనివాసరావుకు వినతి


మందసలో నిర్వహిస్తున్న జన్మభూమి

పోర్టు వద్దు..

వజ్రపుకొత్తూరు: మత్స్యకారుల వినాశనానికే రాష్ట్ర ప్రభుత్వం పోర్టు నిర్మాణ పనులకు పూనుకుంటుందని భావనపాడు పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు లండ దానేషు, డి.రాజులు, వరదరాజులు అన్నారు. మండలంలో దేవునల్తాడ గ్రామంలో సర్పంచ్ ఇ.చిరంజీవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు సంయుక్తంగా అదానీ గ్రూపుకు పోర్టు పనులు అప్పగించడం బాధాకరమన్నారు. మత్స్యకారులకు కావాల్సింది పోర్టు కాదనీ, ఫిషింగ్ హార్బర్, కోల్డ్ స్టోరేజ్‌లు, ఐస్ ప్లాంట్‌లన్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో మత్స్యకారుల పొట్టలు కొట్టి పోర్టులు నిర్మించారనీ, ఆ ప్రాంతాల్లో మత్స్యకారుల బతుకులు అతలాకుతలమయ్యాయన్నారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చడంతోపాటు 50 ఏళ్లు నిండినవారికి పింఛన్ అందించాలని కోరారు. తీర ప్రాంత మత్స్యకారులు తిరుగుబాటు చేయకముందే పోర్టు నిర్మాణ పనులు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ, లేకుంటే ప్రజల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి ఎం.శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎస్.రమణయ్యకు వినతిపత్రం అందజేశారు.

అనంతరం కొత్తపేట, సైనూరు పంచాయతీల్లో సర్పంచ్‌లు ఎ.రఘుపతి, రవికుమార్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మరుగుదొడ్లు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు అందలేదని పలువురు ఫిర్యాదు చేశారు. పింఛన్లు, రేషన్‌కార్డులు తక్కువ సంఖ్యలో మంజూరు చేయడం బాధాకరమన్నారు. గత జన్మభూమి కార్యక్రమాల్లో వివిధ సమస్యలపై వచ్చిన వినతులకు ఇంతవరకు పరిష్కారం చూపించలేదన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వి.తిరుమలరావు, డిటి అప్పలస్వామి, పశువైద్యాధికారి ఎం.పాపారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయండి

ప్రజాశక్తి-సోంపేట

ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అందరూ సహకరించాలని ఎంఇఒ జోరాడు కోరారు. మంగళవారం మండలంలోని మాకన్నపురం ప్రాథమికోన్నత పాఠశాలలో నియోజకవర్గ ప్రతిభా స్థాయి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతిభ పరీక్షలు ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించవచ్చునన్నారు. పోటీతత్వంతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించే అవకాశాలు ఉన్నాయన్నారు. పరీక్షలో ఎనిమిదో తరగతి స్థాయిలో షణ్ముఖరావు, అశ్విని, కార్తీక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో మాకన్నపురం సర్పంచ్ ఎం.నాగేశ్వరరావు, చైర్మన్ కోదండరావు, హెచ్‌ఎం ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న కానుకలు పంపిణీ

ప్రజాశక్తి-పలాస రూరల్

మండలంలో కిష్టుపురం గ్రామంలో చంద్రన్న సంక్రాంతి కానుకలను సర్పంచ్ బూర్లె వరలక్ష్మి, ఎంపిటిసి బూర్లె మాధవి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండగ సమయంలో ప్రజలు ఆనందంగా గడుపుకోవాలనే ఉద్దేశంతో చంద్రన్న కానుకలు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి బి.కృష్ణంరాజు, ఢిల్లీ, తులసి, డీలరు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పూలే అవార్డుకు సుబ్బమ్మ ఎంపిక

ప్రజాశక్తి-కంచిలి


సుబ్బమ్మ

మండలంలోని పురుషోత్తపురం ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డేపల్లి సుబ్బమ్మ రాష్ట్ర స్థాయిలో అందజేస్తున్న సావిత్రిభాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. విశాఖపట్నంలో బుధవారం నిర్వహించే కార్యక్రమంలో తనకు ఈ అవార్డు అందించనున్నట్లు ఆమె తెలియజేశారు. ప్రతి ఏటా రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు వారి పనితీరు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ఈ అవార్డుకు ఎంపిక చేస్తుంటారన్నారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. సుబ్బమ్మ పురుషోత్తపురం పాఠశాలలో ఎస్‌జిటిగా విధులు నిర్వహిస్తున్నారు. సుబ్బమ్మకు అవార్డు రావడం పట్ల పాఠశాల సిబ్బందితోపాటు గ్రామ పెద్దలు, ఎస్‌ఎంసి సభ్యులు తమ అభినందనలు తెలియజేశారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-పలాస

విద్యార్థుల లక్ష్య సాధనకు కృషి చేయాలని వజ్రపుకొత్తూరు ఎంఇఒ పి.కృష్ణప్రసాద్ తెలిపారు. నారాయణదొర కళాశాల 28వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల అధినేత హెచ్.వెంకటరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులను ఎంఇఒ అందజేశారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులే రేపటి పౌరులని ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. రెండేళ్ల చిన్నారి యశస్వీ సహస్ర ప్రదర్శించిన నాట్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆర్.అనంతరావు, రామారావు, కె.శ్రీనివాసరావు, కృష్ణంరాజు, వీర్రాజు, సారథినాయుడు, కల్యాణి, ఈశ్వరరావు, వరహాలశెట్టి, రాజశేఖర్, దుర్గాప్రసాద్ పాత్రో, కె.భారతి, వెంకటరావు, రత్నాకర్, గోపాలరావు, ఇందిరమ్మ, గంగాభవానీ, అశోక్‌వర్ధన్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయమంతా జీతభత్యాలకే సరిపోతోంది

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాకుళం రూరల్

రాష్ట్రానికి వచ్చిన ఆదాయం రూపాయి అయితే రూపాయి పదిపైసలు ఖర్చు అవుతుందని, అది పూర్తిగా అధికారుల జీతాలు, పింఛన్లు, రిటైర్మెంట్లుకే సరిపోతుందని, సంక్షేమ పథకాలు అమలుకు సరిపోవడం లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని భైరిలో సర్పంచ్ ఎండు చిన్నారావు ఆధ్వర్యంలో ఐదో విడత జన్మభూమి కార్యక్రమాన్ని మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రారంభించారు. మొదట బెలూన్లు ఎగురవేసి అనంతరం స్కూల్ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార నిర్వాసిత ప్రాంతాల్లో 18 గ్రామాలను ఖాళీ చేయించడంలో కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జెసి చక్రధరబాబు కీలకపాత్ర వహించారని కొనియాడారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు రైతులు మేలు జరగాలనే ఉద్దేశంతోనే వంశధార ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, పదేళ్లలో ఎటువంటి పనులు ప్రారంభమవ్వలేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రైతుల సంక్షేమం కోసం ప్రాజెక్టు ప్రాంతాల్లో ఉన్న నిర్వాసితులతో 15 సార్లు సంప్రదించి రూ.435 కోట్ల నిధులు తెచ్చానని వాటిని మూడున్నరేళ్లలో ఎటువంటి పంపిణీ చోటుచేసుకోకపోవడంపై ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. గతంలో పనిచేసిన కలెక్టర్, జెసి నిర్వాసిత ప్రాంతాల్లో పాత్ర పాక్షికంగా ఉందని, ప్రస్తుత కలెక్టర్, జెసి నిర్వాసిత ప్రాంతాలు ఖాళీ చేయించడంలో కీలకపాత్ర వహించారని, 19 గ్రామాల్లో 6,700 కుటుంబాలున్నాయని, డిసెంబర్ 31వ తేదీలోగా అన్ని ఇళ్లూ కూల్చి నేలమట్టం చేసిన ఘనత కలెక్టర్, జేసీదేనన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమమైతే ప్రభుత్వం నుంచి ఏదో వస్తుందని ఆశించడం సరైందని కాదని, గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు రూ.1000 ఇచ్చేవాళ్లమని ప్రస్తుతం రూ.ఆరువేలకు పెంచినట్టు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హిజ్రాలకు కూడా రూ.1,500 పింఛను ఈ నెల నుంచి ఇస్తున్న ఘనత సిఎందేనని కొనియాడారు. జనవరి, ఫిబ్రవరిలో పెళ్లిళ్లు ఎవరూ చేసుకోరు గనుక పెళ్లిళ్లు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయో అప్పటి నుంచి చేసుకున్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు ప్రభుత్వం తరుపున కానుక ఉంటుందని తెలిపారు. ఇప్పటికే పింఛన్లు, రేషన్‌కార్డులు, సంక్షేమ పథకాలు చాలావరకు ఇచ్చామని, ఈసారి జన్మభూమి కార్యక్రమంలో అభివృద్ధిపై చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 46 లక్షల పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో శ్రీకాకుళం జిల్లా చాలా వెనుకబడి ఉందని, వాటి నిర్మాణాలకు అందరూ సహకరించాలని కోరారు. ఐఎస్ఎల్ పూర్తయితే పంచాయతీలకే నిధులు మంజూరు చేస్తామని కరాకండిగా చెప్పారు. ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి అనేక


సభలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రకాలుగా తోడ్పడుతుందని పేర్కొన్నారు. భైరి గ్రామానికి మూడు రైతు రథాలు మంజూరయ్యాయని, రైతులకు సబ్సిడీపై వీటిని ఇస్తున్నామని తెలిపారు. సభా ప్రారంభం ముందు చంద్రబాబు ప్రసంగం, జాతీయగీతం, ప్రతిజ్ఞ, పలు జానపద గేయాలు, పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్కూల్ ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని, రైతు రథాలను మంత్రి, ఎమ్మెల్యే ప్రారంభించారు. కలెక్టర్, జెసిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి గొండు జగన్నాథరావు, వైస్ ఎంపిపి జి.అసిరప్పుడు, జిల్లా జన్మభూమి కార్యక్రమం ప్రత్యేకాధికారి విక్రాంత్, ఆర్‌డిఒ బి.దయానిధి, తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ, టిడిపి నాయకులు, డిఎంఅండ్‌హెచ్ఒ సనపల తిరుపతిరావు, డిఇఒ, డిఎస్ఒ మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ధనంజయరెడ్డి

డిజెఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాకుళం సిటీ

డెస్క్ జర్నలిస్టుల ఫోరం 2018 డైరీని కలెక్టర్ కె.ధనంజయరెడ్డి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. కొత్త తరహాలో డైరీని తీసుకురావడంపై డిజెఎఫ్ ప్రతినిధులను అభినందించారు. డెస్క్ జర్నలిస్టుల సంక్షేమానికి సహకరించాలని డిజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు బొడ్డేపల్లి ప్రసాదరావు, అధ్యక్షులు పైడి చిన్న అప్పలనాయుడు, కోశాధికారి ఆరవెల్లి గుహానంద్, జర్నలిస్ట్ ఐక్యవేదిక ప్రతినిధులు కె.వేణుగోపాలరావు, ఎస్.జోగినాయుడు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డిజెఎఫ్ సభ్యులు వైఎస్ నివాస్, పి.శ్రీనివాసరావు, ఎం.దేవానంద్, రామకృష్ణ, అశోక్‌కుమార్, పి.భవానీ ప్రసాద్, బి.శ్రీరామ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి 'ఆదర్శ' విద్యార్థి

ప్రజాశక్తి-టెక్కలి

స్థానిక ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి పి.గణేష్ జాతీయస్థాయి లగోరి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ నౌపడ సింహాచలం మంగళవారం తెలిపారు. ఈ మేరకు 5, 6, 7 తేదీల్లో కర్నాటక రాష్ట్రం మంగుళూరులో నిర్వహించే జాతీయస్థాయి లగోరి పోటీల్లో పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన గణేష్‌ను పాఠశాల సిబ్బంది సూర్యప్రభ, జీవనరావు తదితరులు అభినందించారు. అదే విధంగా మండలంలోని లింగాలవలస పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి జి.తిరుమలరావు జాతీయస్థాయి లగోరి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల పిఇటి నారాయణరావు, సిబ్బంది అభినందించారు.


గణేష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామారావుకు అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి - మందస

విధి నిర్వహణలో గుండెపోటుతో సోమవారం హఠాన్మరణం చెందిన ప్రజాశక్తి పలాస డివిజన్ ఇన్‌ఛార్జి జన్ని రామారావుకు అశ్రునయనాలతో మంగళవారం అంతిమ వీడ్కోలు పలికారు. రామారావు భౌతికకాయానికి ప్రజాశక్తి సిబ్బంది, సిపిఎం, పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, బంధుమిత్రులు సందర్శించి నివాళ్లర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. హరిపురంలోని రామారావు అత్తారింటి నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన గల శ్మశానవాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. అనంతరం రామారావు భౌతికకాయానికి దహన సంస్కారాలు నిర్వహించారు.


అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు


నివాళ్లర్పిస్తున్న నాయకులు

రామారావు ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలి

రామారావు ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని ప్రజాశక్తి విశాఖపట్నం, శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్లు సుధాకర్, ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, ప్రజాశక్తి అభివృద్ధికి రామారావు పాటుపడ్డారని కొనియాడారు. సమన్వయంతో అన్ని విభాగాల్లో డివిజన్‌ను ముందుకు నడిపించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన మృతి ప్రజాశక్తికి తీరని లోటు అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు మాట్లాడుతూ రామారావు మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటు అని అన్నారు. విద్యార్థి దశ నుంచి ఉద్యమాల్లో చురుగ్గా ఉండేవారని చెప్పారు.

అంత్యక్రియల్లో సిపిఎం నాయకులు కె.మోహనరావు, బమ్మిడి ఆనందరావు, ఎం.కోదండరావు, ఎన్.గణపతి, అల్లు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి దున్న వాసుదేవరావు, టి.వీరాస్వామి, వైసిపి వజ్రపుకొత్తూరు మండల కన్వీనర్ మరడ భాస్కరరెడ్డి, బి.జగన్నాయకులు, స్థానిక ఎంపిటిసి సభ్యుడు జన్ని పురుషోత్తం, కార్మిక సంఘ నాయకులు ఎం.ఖగేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు జి.కోదండరావు, బి.ఓంకార్, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అప్పలరాజు పరామర్శ

రామారావు కుటుంబసభ్యులను పలాస నియోజకవర్గ వైసిపి కన్వీనర్ డాక్టర్ సీదిరి అప్పలరాజు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామారావు భార్య భాగ్యలక్ష్మితో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధికి రామారావు ఎనలేని సేవలందించారని కొనియాడారు. అభ్యుదయ భావజాలంతో ప్రజల సమస్యలపై పోరాడేవారన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు తనవంతు సాయం చేస్తానన్నారు. ఆయన వెంట వైసిపి పలాస పట్టణ కన్వీనర్ డి.శ్రీకాంత్, హరిపురం సర్పంచ్ ఎం.గౌరి, ఎంపిటిసి జె.పురుషోత్తం తదితరులున్నారు.

రామారావు మృతికి సంతాపం

కోటబొమ్మాళి : రామారావు హఠాన్మరణం పత్రికా రంగానికి లోటు అని కోటబొమ్మాళి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి నౌపాడ హరిప్రభాకర్, తిర్లంగి రవికుమార్, జర్నలిస్టులు ముద్దాడ మోహనరావు, బగాది తేజేశ్వరరావు తదితరులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చెస్‌లో యశ్వంత్‌కు రజతం

ప్రజాశక్తి-శ్రీకాకుళం సిటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలిటెక్నిక్ చదరంగం క్రీడా ఛాంపియన్ షిప్ పోటీల్లో నగరానికి చెందిన భేరి యశ్వంత్ రజత పతకం సాధించాడు. ప్రకాశం జిల్లాలోని ఒంగోలు పేస్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నికల్ బోర్డు ఆధ్వర్యంలో డిసెంబర్ 28 నుంచి 31 వరకు నిర్వహించిన పోటీల్లో సత్తా చాటాడు. మూడు రోజులపాటు నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2017 నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో చేస్తున్న యశ్వంత్ 4 రౌండ్లపాటు జరిగిన చెస్ ఛాంపియన్ షిప్‌లో రజతపతకం సాధించాడు. యశ్వంత్ విజయంపై కళాశాల ప్రిన్స్‌పల్, అధ్యాపకులు, సిబ్బంది, సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.


రజతం సాధించిన యశ్వంత్